తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 44 | 2.11.2026 నుంచి 8.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |





‘స్థానిక’ ఎన్నికలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ: స్థానిక ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 27 నాటి విచారణకు సంబంధించిన ఆర్డర్ కాపీ రిలీజ్ చేసింది. వైఎస్సార్‌సీపీ ఆధారాలపై సుప్రీంకోర్టు స్పందించింది. నామినేషన్లు అడ్డుకుంటే అక్రమంగా రిజెక్ట్ చేసినట్లేనని చెప్పింది. ఆధారాలు పరిశీలించి పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్థి అనుమతి లేకుండా నామినేషన్ రిజెక్ట్ చేస్తే న్యాయపోరాటానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మున్సిపల్ ఎన్నికలే కాకుండా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకూ ఇవే ఆదేశాలు వర్తిస్తాయని సుప్రీంకోర్టు చెప్పింది. నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు సీసీ ఫుటేజీ భద్రపరచాలి. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా భద్రతను కట్టుదిట్టం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

రాప్తాడు ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

తాడేపల్లి : అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థినిపై జరిగిన దాడిని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వైఎస్ జగన్.. తరగతి గదిలోనే చైన్‌సాతో దాడి జరగడం అత్యంత దారుణమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతలు పూర్తిగా కుప్ప కూలిపోయాయనడానికి ఈ ఘటనే నిదర్శమన్నారు వైఎస్ జగన్. చంద్రబాబు జంగిల్‌రాజ్‌లో విద్యార్థినులకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన ?వ్యక్తం చేశారు. ఈ మేరకు ‘ఎక్స్’ వేదికగా ట్వీట్ చేశారు.

‘ఓ దుండగుడు ప్రభుత్వ పాఠశాలలోకి స్వేచ్ఛగా ప్రవేశించి విద్యార్థినిపై అత్యంత పాశవికంగా ఎలా దాడి చేయగలిగాడు?, విద్యాలయాల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించలేని ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ ఘటన అద్దం పడుతోంది. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరం. పాలనను గాలికొదిలేసి రాజకీయ కక్షసాధింపులు.. రెడ్‌బుక్ రాజ్యాంగానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. చంద్రబాబు పాలనలో నేరస్థులకు చట్టమంటే భయం లేకుండా పోయింది.

- ఎన్నికలెందుకు..? ప్రజాధనం ఖర్చు చేయడం ఎందుకు?
- ఎన్నికలెందుకు..? ఏకగ్రీవాలే ముద్దా!
- ఓటు వేయకుండానే పదవులు.. ప్రజాస్వామ్యానికి పాతర!
- ప్రజల ఓటుతో పనిలేదు.. పదవులే ముఖ్యం
- ఎన్నికల ఖర్చు దండగ.. గెలుపు ముందే ఖరారు!
- ప్రజాస్వామ్యమా.. అధికార స్వామ్యమా?



ఓటరు లేకుండానే గెలుపు.. ఇదేం ప్రజాస్వామ్యం!

అమరావతి: ఒకప్పుడు ఎన్నికలంటే పోటీ ఉండేది. ప్రచార హోరు కనిపించేది. ప్రత్యర్థుల మధ్య రాజకీయ పోరాటం సాగేది. కొన్నిచోట్ల పోలింగ్ రోజు బూత్‌లను కబ్జా చేసి రిగ్గింగ్‌కు పాల్పడేవారు. అదీ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టే అయినప్పటికీ.. కనీసం ఎక్కడో ఒకచోట ఓటరు ఓటు వేసేవాడు. ఆ ఓట్ల ఆధారంగానైనా గెలుపోటములు నిర్ణయమయ్యేవి. కానీ, ఇప్పుడు ఏపీలో జరుగుతున్న స్థానిక ఎన్నికల ప్రక్రియ చూస్తుంటే ఓటరుతో అసలు పనేమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఓటు వేయకుండానే గెలిచే పరిస్థితులు.. ప్రజల తీర్పుతో సంబంధం లేకుండానే చైర్మన్ పదవులు దక్కించుకునే రాజకీయాలు కనిపిస్తున్నాయి.

నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులను పోలీసులే అడ్డుకున్నారనే ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతటి దిగజారుడుతనానికి నిదర్శనమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కొన్ని చోట్ల అధికార పార్టీ నాయకుల దాడులను తట్టుకుని నామినేషన్ కేంద్రాలకు చేరుకున్నా పత్రాలు స్వీకరించలేదు. మరికొన్ని చోట్ల అధికారుల చేతుల్లో ఉన్న నామినేషన్లను బలవంతంగా లాక్కెళ్లినా అధికారులు, పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇక నామినేషన్ల పరిశీలన ప్రక్రియ మరో ప్రహసనంగా మారిందనే ఆరోపణలున్నాయి. సంతకం నీది కాదని, రాత నీది కాదని, ఈ పత్రం లేదని, ఆ ధ్రువపత్రం లేదని సాకులు చూపుతూ ప్రత్యర్థుల నామినేషన్లను తిరస్కరించారనే ఫిర్యాదులు వచ్చాయి. ఎన్నికల నిర్వహణలో నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన యంత్రాంగమే వివాదాలకు కేంద్రంగా మారితే బాధితులు ఎవరిని ఆశ్రయించాలి? ఎన్నికల ప్రక్రియలో న్యాయస్థానాల జోక్యానికి పరిమితులున్నాయని చెబుతున్నప్పుడు.. ఆ ప్రక్రియలోనే అక్రమాలు చోటుచేసుకుంటే సామాన్యుడికి న్యాయం ఎక్కడ దొరుకుతుంది?

ఇదంతా ఒకవైపు సాగుతుంటే మరోవైపు ప్రత్యర్థుల ఇళ్లు, వారి అనుచరుల నివాసాలపై తనిఖీల పేరుతో ఒత్తిళ్లు, బెదిరింపులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వాటితోపాటు ప్రచార కరపత్రాలు పంపిణీ చేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. ప్రతిపక్షాల విషయంలో మాత్రం నిబంధనలు గుర్తుకొస్తున్నాయా? అధికార పక్షం విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

రేపు పోలింగ్ జరగనున్న ప్రాంతాల్లోనూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు కొన్ని మూకలు సిద్ధంగా ఉన్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాల మార్పు నిర్ణయాలు కూడా వివాదాలకు దారితీశాయి. పోలీసు అధికారులు రాజకీయ నాయకుల తరహాలో మీడియా సమావేశాలు నిర్వహిస్తూ వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తున్న యువతలో ఇప్పుడు ఒకటే చర్చ. ఇలాంటి ఎన్నికలు అవసరమా? ప్రజాస్వామ్యం పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎందుకు? ఓటరు ప్రమేయం లేకుండానే పదవులు ఖరారైతే ఇక పోలింగ్ ఎందుకు? ఎన్నికల సంఘాలు, అధికారులు, పోలీసు వ్యవస్థలు ఉన్నది ఎవరి కోసం? ప్రజల హక్కులను కాపాడలేని వ్యవస్థలతో ప్రయోజనం ఏమిటి?

చివరకు యువతలో వినిపిస్తున్న వ్యంగ్యమైన వ్యాఖ్య మరింత ఆలోచింపజేస్తోంది. ఎన్నికలే లేకుండా ఒక రాజు, ఆయన కింద సామంత రాజులు పాలిస్తే కనీసం ఎన్నికల ఖర్చయినా మిగులు తుందని అంటున్నారు. ఇది నిజంగా రాజరికాన్ని కోరుకోవడం కాదు.. ప్రజాస్వామ్య వ్యవస్థపై పెరుగుతున్న నిరాశకు అద్దం పట్టే వ్యాఖ్య.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అంటే కేవలం పదవులు పంచుకునే ప్రక్రియ కాదు. ప్రజలకు తమ పాలకులను ఎన్నుకునే హక్కు కల్పించే పవిత్రమైన బాధ్యత. ఆ హక్కునే నిర్వీర్యం చేస్తే మిగిలేది ఎన్నికల తంతు మాత్రమే. ఓటరు లేకుండా గెలుపులు.. పోటీ లేకుండా పదవులు.. ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నాలు కొనసాగితే ప్రజాస్వామ్యం పేరుకు మాత్రమే మిగిలిపోతుంది. అప్పుడు ప్రజలు అడిగే ప్రశ్న ఒక్కటే.. ఎన్నికలు నిర్వహిస్తున్నారా.. లేక గెలుపులను ముందుగానే నిర్ణయిస్తున్నారా?

జీవీఎంసీ మేయర్ పీఠంపై ఉత్కంఠ!

కూటమి ధీమాకు సవాళ్లు.. చర్చల్లోకి వరుదు కల్యాణి పేరు!

- విశాఖ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు.. భూవివాదాలు, ఉక్కు పరిరక్షణ, నీటి సమస్యలే ప్రచార అస్త్రాలు!
- విశాఖలో కూటమికి కఠిన పరీక్ష.. మేయర్ రేసులో వరుదు కల్యాణి కేంద్రబిందువు!
- 120 డివిజన్లు.. 15 మంది అభ్యర్థులు.. విశాఖ మేయర్ పీఠంపై హోరాహోరీ!
- గీతం భూముల నుంచి డేటా సెంటర్ల వరకు.. జీవీఎంసీ ఎన్నికల్లో రాజకీయ రగడ!

విశాఖపట్నం : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికల వేళ నగర రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. 120 డివిజన్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద నగరపాలక సంస్థగా ఉన్న జీవీఎంసీ మేయర్ పీఠంపై రాజకీయ పార్టీల మధ్య పోటీ కేంద్రీకృతమైంది. కూటమి తరఫున విజయం ఖాయమనే ధీమా వ్యక్తమవుతున్న వేళ.. వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేరు రాజకీయ చర్చల్లో ప్రధానంగా వినిపిస్తుండటం కొత్త పరిణామంగా మారింది. విశాఖ రాజకీయాల్లో బలాబలాలపై జరుగుతున్న చర్చలకు ఆమె అభ్యర్థిత్వం మరో కోణాన్ని జోడించింది.

కూటమి శిబిరంలో అసమ్మతి సెగ.. జనసేన నేత మద్దతు కల్యాణికి!

మేయర్ ఎన్నికల్లో ప్రధాన పోటీ టీడీపీ అభ్యర్థి ముక్క శ్రావణి, వైసీపీ అభ్యర్థి వరుదు కల్యాణి మధ్య కేంద్రీకృతమైంది. మేయర్ పదవికి మొత్తం 15 మంది బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పార్టీల మధ్య పోరే రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కూటమి పార్టీల్లో టికెట్లు దక్కని ఆశావహులు, అసంతృప్త నేతల వ్యవహారం కూడా ప్రచారంలో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా జనసేన మాజీ నేత, పర్యావరణ కార్యకర్త బొలిశెట్టి సత్యనారాయణ వరుదు కల్యాణికి మద్దతు ప్రకటించడం రాజకీయంగా ప్రత్యేక చర్చకు దారితీసింది. విశాఖ ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, డేటా సెంటర్ల అంశాలను ప్రస్తావిస్తూ ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

గీతం భూముల అంశం.. వైసీపీకి ప్రధాన ప్రచారాస్త్రం!

విశాఖలో గీతం యూనివర్సిటీకి సంబంధించిన ప్రభుత్వ భూముల వ్యవహారం మరోసారి రాజకీయ వేడిని పెంచుతోంది. గీతం యూనివర్సిటీ ముసుగులో ప్రభుత్వ భూములు ఆక్రమించారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను మేయర్ అభ్యర్థి వరుదు కల్యాణి ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. తమకు అవకాశం కల్పిస్తే ప్రభుత్వ భూముల వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని ఆమె చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల వివరణ, అధికారిక రికార్డుల ఆధారంగా వాస్తవాలను పరిశీలించాల్సి ఉంది.

డేటా సెంటర్లపై ప్రశ్నలు.. అభివృద్ధి ఎవరి కోసం?

విశాఖలో ప్రతిపాదిత భారీ డేటా సెంటర్ల ఏర్పాటుపై కూడా రాజకీయ వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో నగర ప్రజల తాగునీటి అవసరాలకు ఇబ్బందులు కలగకూడదని పర్యావరణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖలో ఇప్పటికే నీటి సరఫరా, డిమాండ్ మధ్య అంతరం ఉందని అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. అయితే ప్రభుత్వం మాత్రం నివాస ప్రాంతాలకు, గ్రామీణ తాగునీటి అవసరాలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని చెబుతోంది. ఈ నేపథ్యంలో డేటా సెంటర్లపై ఇరు పక్షాల వాదనలు ఎన్నికల చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

విశాఖ ఉక్కు.. నగర భవిష్యత్తుపై ఎవరి వైఖరి?

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, పర్యావరణ సమస్యలు, నగర మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా వంటి అంశాలు మేయర్ ఎన్నికల చర్చల్లో ముందుకొస్తున్నాయి. కేవలం రాజకీయ పార్టీల బలాబలాలకే పరిమితం కాకుండా నగర భవిష్యత్తుకు సంబంధించి అభ్యర్థులు ఏం చెబుతున్నారు? ప్రజా సమస్యలపై వారి కార్యాచరణ ఏమిటి? అన్న ప్రశ్నలు కూడా తెరపైకి వస్తున్నాయి.

నవంబర్ 1న ఓటర్ల తీర్పు.. నవంబర్ 3న ఫలితాలు!

120 డివిజన్లతో కూడిన జీవీఎంసీ ఎన్నికల్లో 573 మంది కార్పొరేటర్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మేయర్ పదవికి 15 మంది బరిలో నిలిచారు. నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. కూటమి తరఫున ముక్క శ్రావణి, వైసీపీ తరఫున వరుదు కల్యాణి ప్రధాన పోటీదారులుగా నిలిచారు. ప్రచారంలో వినిపించిన హామీలు, ఆరోపణలు, అభివృద్ధి వాదనలు ఎంతవరకు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపాయో ఎన్నికల ఫలితాలే వెల్లడించనున్నాయి.

నిరుద్యోగులకు విజయ్ సర్కార్ గుడ్‌న్యూస్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీపడుతున్న అభ్యర్థులకు భారీ ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్లపాటు సడలింపు ప్రకటించారు. ఈ నిర్ణయంతో వయోపరిమితి కారణంగా ఇప్పటివరకు ఉద్యోగ పరీక్షలకు దూరమైన వేలాది మంది అభ్యర్థులకు మరో అవకాశం లభించనుంది. ప్రభుత్వ ఉద్యోగ ఆశావహుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటన వెల్లడించింది. ఇప్పటికే అమల్లో ఉన్న వయోపరిమితి సడలింపులకు అదనంగా ఈ ఐదేళ్ల మినహాయింపు వర్తించనుంది.

గ్రూప్స్ అభ్యర్థులకు భారీ ఊరట

తాజా నిర్ణయం ప్రకారం గ్రూప్-1 ఉద్యోగాలకు జనరల్ కేటగిరీ అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 32 ఏళ్ల నుంచి 37 ఏళ్లకు పెరగనుంది. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు 37 ఏళ్ల నుంచి 42 ఏళ్లకు పెంచారు. దివ్యాంగ అభ్యర్థుల్లో జనరల్ కేటగిరీ వారికి 42 నుంచి 47 ఏళ్లకు, రిజర్వేషన్ కేటగిరీ వారికి 47 నుంచి 52 ఏళ్లకు వయోపరిమితిని పెంచారు. అలాగే, గ్రూప్-2 ఉద్యోగాలకు జనరల్ కేటగిరీ అభ్యర్థుల వయోపరిమితిని 30 నుంచి 35 ఏళ్లకు పెంచారు. జనరల్ కేటగిరీకి చెందిన దివ్యాంగ అభ్యర్థులకు 40 నుంచి 45 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉద్యోగాలకు రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు ఇప్పటికే గరిష్ఠ వయోపరిమితి లేదు. కాగా, ఈ కొత్త నిబంధనలు ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయి. దీంతో తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు మరింత సమయం, అవకాశాలు లభించనున్నాయి.

2027 జనగణనకు ముహూర్తం ఖరారు!

ఢిల్లీ : దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు సమాచారం. 2027 జనగణన నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి సర్వే ద్వారా జనాభా వివరాలను సేకరించనున్నట్లు వెల్లడించారు. ఈసారి జనగణన ప్రక్రియలో డిజిటల్ విధానానికి కూడా అవకాశం కల్పించారు. అధికారులు ఇళ్లకు వచ్చి వివరాలు నమోదు చేయడానికి ముందుగానే ప్రజలు స్వయంగా తమ కుటుంబ, జనాభా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ఇందుకోసం జనవరి 10 నుంచి 24 వరకు ప్రత్యేక గడువు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ ఆన్‌లైన్ నమోదు పూర్తిగా ఐచ్ఛికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోని వారి ఇళ్లకు జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన సిబ్బంది నేరుగా వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ ప్రక్రియలో కుటుంబ సభ్యుల సంఖ్య, ఇతర జనాభా సంబంధిత సమాచారాన్ని నమోదు చేస్తారు. సేకరించిన వివరాల్లో ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే సరిచేసుకునేందుకు మార్చి 1 నుంచి మార్చి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. 2027 మార్చి 1వ తేదీని జనగణనకు ప్రామాణిక తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. అయితే ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, మంచు ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. దేశ జనాభా గణాంకాల సేకరణలో కీలకమైన ఈ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైనది. డిజిటల్ నమోదు సౌకర్యం అందుబాటులోకి రావడంతో ఇంటింటి సర్వేకు ముందే వివరాలు సమర్పించుకునే అవకాశం ప్రజలకు కలగనుంది.

ఓటు చోరీపై పార్లమెంటులో చర్చిద్దాం రండి

లఖ్‌నవూ: ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు గుప్పించారు. విపక్షాల తీరు చూస్తుంటే క్రికెట్ మ్యాచ్ ఓడిపోయాక మరింత కష్టపడి సాధన చేయకుండా అంపైర్ వల్లే పరాజయం పాలయ్యామని ఆరోపిస్తున్నట్లుందని ఎద్దేవా చేశారు. ఓటు చోరీ ఆరోపణలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పార్లమెంటు వేదికగా ఓటుచోరీపై చర్చకు సిద్ధమా అని షా సవాలు విసిరారు. లఖ్‌నవూలో శుక్రవారం జరిగిన భాజపా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. వచ్చే ఏడాది జరిగే ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో భాజపా తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. యూపీలో భాజపా మళ్లీ అధికారంలోకి రాగానే పలు రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులోకి తెచ్చిన ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమల్లోకి తీసుకొస్తామని ప్రకటించారు. ఇండియా కూటమి చేపట్టిన 'చలో దిల్లీ' కార్యక్రమానికి అమిత్ షా అవరోధాలు కల్పిస్తున్నారన్న రాహుల్ ఆరోపణలను భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర తోసిపుచ్చారు. ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య ప్రచారం చేయొద్దని హితవుపలికారు.

డిజిటల్ వార్‌లో వరుదు కల్యాణి జోరు

విశాఖపట్నం: క్షేత్రస్థాయిలో మైకుల ప్రచార హోరు ముగిసినా, అసలైన సమరం సోషల్ మీడియా వేదికగా డిజిటల్ స్క్రీన్‌లపై ఇప్పుడు పీక్స్‌కు చేరింది. జీవీఎంసీ ఎన్నికల సమరం.. క్లైమాక్స్‌కు చేరుకున్న వేళ.. ప్రచారంలోనే కాదు.. 'స్మార్ట్'స్క్రీన్ల మీదా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరుదు కల్యాణి సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. అటు ప్రజలతో మమేకమవ్వడంలోనూ.. ఇటు అన్ని వర్గాల నెటిజన్లను ఆకట్టుకోవడంలోనూ టీడీపీ అభ్యర్థి ముక్కా శ్రావణి కంటే చాలా ముందంజలో ఉన్నారు. జీవీఎంసీ మేయర్ ఎన్నికల బరిలో నిలిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరుదు కల్యాణి ప్రచార శైలి నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. క్లిక్‌మనిపిస్తే చాలు ఆమె ప్రచార దశ్యాలు, ప్రజలతో మమేకమవుతున్న రీల్స్.. మొబైల్ ఫోన్లలో ప్రత్యక్షమవుతున్నాయి. కేవలం ఒక వైపు ప్రచారానికే పరిమితం కాకుండా, ఓటర్లు అడిగే ప్రశ్నలకు సమాధానమిస్తూ, అందరితో కలుపుగోలుగా దూసుకుపోతూ డిజిటల్ వేదికలపై నయా ట్రెండ్ సెట్ చేస్తున్నారు. ఎన్నికల వ్యూహంలో అత్యంత కీలకమైన మేనిఫెస్టో అస్త్రాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రతి ఇంటికీ, ప్రతి వర్గానికి చేర్చడంలో వరుదు కల్యాణి టీమ్ పూర్తి సక్సెస్ అయింది. ఆమెకున్న స్పష్టమైన వాక్చాతుర్యం, స్థానిక సమస్యలపై ఉన్న పట్టు డిజిటల్ ప్రచారానికి భారీ మైలేజ్ తెచ్చిపెట్టాయి. ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విటర్) వేదికలపై ఆమె షేర్ చేస్తున్న పోస్టులు, వీడియోలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఓటర్ల నాడి ఎటువైపు ఉందో స్పష్టంగా అర్థమవుతోంది. టీడీపీ అభ్యర్థి ముక్కా శ్రావణితో పోల్చి చూస్తే సోషల్ మీడియా ఫాలోయింగ్‌లో వరుదు కల్యాణిదే స్పష్టమైన పైచేయి. ఇన్‌స్టాగ్రాంలో 64 వేలకు పైగా, ఫేస్‌బుక్‌లో 78 వేల మందికి పైగా ఫాలోవర్లతో కల్యాణి సుడిగాలి వేగంతో దూసుకు పోతుండగా, శ్రావణి ఫేస్‌బుక్‌లో 5,700, ఇన్‌స్టాగ్రాంలో 6,232 మంది ఫాలోవర్లకే పరిమితమై గట్టి పోటీ ఇవ్వలేకపోతున్నారు.

అక్షరాలు నేర్చుకునే చోట అరాచకం..

పదో తరగతి బాలికపై దాడి!

- చదువుల తల్లిపై కిరాతకం.. స్నేహితురాలిని కాపాడబోయి మరో బాలికకు గాయాలు!
- చదువుల బడిలో రంపంతో దాడి.. పదో తరగతి బాలికకు తీవ్ర గాయాలు
- అడ్డుకునేందుకు వెళ్లిన మరో విద్యార్థినికీ గాయాలు
- పాఠశాల ప్రాంగణంలో ఒక్కసారిగా భయాందోళనలు
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు
- దాడికి కారణాలపై కొనసాగుతున్న విచారణ

అనంతపురం, రాప్తాడు : పుస్తకాల సంచిని భుజాన వేసుకుని.. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో పాఠశాల గడప తొక్కిన ఓ పదో తరగతి విద్యార్థిని జీవితంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. అక్షరాలు నేర్చుకోవాల్సిన తరగతి గది సమీపంలోనే రక్తం చిందింది. తోటి విద్యార్థులతో కలిసి చదువు కోవాల్సిన పాఠశాల ప్రాంగణం ఒక్కసారిగా భయాందోళనలకు వేదికైంది. అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది. పదో తరగతి విద్యార్థినిపై ఓ గుర్తుతెలియని వ్యక్తి చెట్ల కొమ్మలు కోసే రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. పాఠశాల ప్రారంభమైన కొద్దిసేపటికే గుర్తుతెలియని ఓ యువకుడు పాఠశాల ప్రాంగణం లోకి ప్రవేశించి, చెట్ల కొమ్మలు నరికేందుకు ఉపయోగించే రంపంతో పదో తరగతి చదువుతున్న బాలికపై దాడికి జరిగింది. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.

అడ్డుకునేందుకు వెళ్లిన మరో విద్యార్థినిపైనా దాడి!

తోటి విద్యార్థినిపై జరుగుతున్న దాడిని చూసి భయంతో వెనక్కి తగ్గకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో బాలిక కూడా గాయాలు పాలుఅయింది. ఆ క్షణంలో అక్కడున్న విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికే భయంగా ఉంది. కళ్లముందు స్నేహితురాలిపై దాడి జరుగుతుంటే ఏం చేయాలో తెలియని అయోమయం.. ప్రాణభయంతో పరుగులు తీసిన విద్యా ర్థులు.. ఒక్కసారిగా పాఠశాల వాతావరణాన్ని విషాదంలోకి నెట్టాయి.

తల్లిదండ్రుల ఆశలపై పిడుగు!

పదో తరగతి అంటే విద్యార్థుల జీవితంలో కీలకమైన మలుపు. పరీక్షలకు సిద్ధమవుతూ, మంచి మార్కులు సాధించి తమ కుటుంబానికి పేరు తీసుకురావాలని కలలు కనే వయసు. అలాంటి సమయంలో పాఠశాలలోనే దాడికి గురికావడం కలచివేస్తోంది. తమ బిడ్డ చదువుకుంటూ సురక్షితంగా ఉంటుందని భావించి పాఠశాలకు పంపిన తల్లిదండ్రులకు ఈ ఘటన ఎంతటి ఆవేదన కలిగిస్తుందో మాటల్లో చెప్పలేం.

పాఠశాలల్లో బాలికల భద్రతపై మళ్లీ ప్రశ్నలు!

విద్యార్థులకు భద్రత కల్పించాల్సిన పాఠశాల ప్రాంగణంలోనే ఇలాంటి దారుణ ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. పాఠశాలల్లోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా తగిన భద్రతా చర్యలు ఉన్నాయా? విద్యార్థుల రక్షణకు అవసరమైన పర్యవేక్షణ కొనసాగుతోందా? అనే అంశాలపై విద్యాశాఖ, పోలీసు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి ఎవరు? విద్యార్థినికి తెలిసిన వ్యక్తేనా? వ్యక్తిగత కక్షలతో ఈ దారుణానికి పాల్పడ్డాడా? అనే కోణాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఉండాల్సిన పాఠశాలలోనే ఇలాంటి ఘటన జరగడం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఉదయం స్కూల్ ప్రారంభమైన సమయంలోనే ఓ వ్యక్తి లోపలికి చొరబడి విద్యార్థినులపై దాడికి పాల్పడటం పాఠశాలల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిందితుడిని త్వరగా పట్టుకుని, దాడికి గల కారణాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.. ఒక బాలికకు జరిగిన గాయం ఒక్క కుటుంబానికే పరిమితమైన విషాదం కాదు.. విద్యార్థుల భద్రతపై సమాజం మొత్తం ఆలోచించాల్సిన హెచ్చరిక. బడికి వెళ్లే ప్రతి బిడ్డ సురక్షితంగా ఇంటికి తిరిగి రావాలి. అదే తల్లిదండ్రుల ఆకాంక్ష.. అదే సమాజ బాధ్యత!

పోలీసుల అదుపులో నిందితుడు హేమంత్?

రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు నిందితుడిని గుర్తించినట్లు సమాచారం. నాగులూరుకు చెందిన హేమంత్ ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారని తెలుస్తోంది. ధర్మవరం రైల్వే స్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.బాధిత బాలికకు నిందితుడు సమీప బంధువని తెలుస్తోంది. బాలిక ప్రేమను నిరాకరించడంతో కక్ష పెంచుకుని ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే దాడికి గల అసలు కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు ఘటన జరిగిన పాఠశాల తరగతి గదిలో ఫోరెన్సిక్ బృందం పరిశీలన చేపట్టింది. కీలక ఆధారాలను సేకరిస్తోంది. విద్యార్థినిపై దాడికి సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

చిన్నారిపై పైశాచిక దాడి.. పాఠశాల భద్రత ఏమైంది?

- ఆరేళ్ల బాలికపై మూడో తరగతి విద్యార్థి దాడి
- రాళ్లు, ఇటుకలు, పూలకుండీతో విచక్షణారహితంగా కొట్టిన వైనం
- స్పృహ కోల్పోయినా వదలని దాడి.. ఆసుపత్రిలో చిన్నారి
- పాఠశాల పర్యవేక్షణ, పిల్లల భద్రతపై తీవ్ర ప్రశ్నలు

హర్యానా, పంచకులా: బడి అంటే పిల్లలకు అక్షరాలు నేర్పించే ఆలయం.. తల్లిదండ్రులు తమ చిన్నారులను నమ్మకంతో అప్పగించే చోటు. అలాంటి పాఠశాల ప్రాంగణంలోనే ఆరేళ్ల పసిపాపపై దాడి జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తోటి విద్యార్థితో కలిసి ఆడుకోవాల్సిన వయసులో ఓ బాలుడు దాడికి దిగడం, అది కూడా రాళ్లు, ఇటుకలు, పూలకుండీతో విచక్షణారహితంగా కొట్టడం కలచివేస్తోంది. హర్యానాలోని పంచకులాలో వెలుగుచూసిన ఈ ఘటన పాఠశాలల్లో చిన్నారుల భద్రతపై మరోసారి చర్చకు తెరలేపింది.

ఆటపాటల వయసులోనే దాడి!

పంచకులా సెక్టార్-20లోని సంస్కృతి మోడల్ స్కూల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కిండర్‌గార్టెన్‌లో చదువుతున్న ఆరేళ్ల బాలికపై అదే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల బాలుడు దాడికి పాల్పడినట్లు సమాచారం. సీసీటీవీ దృశ్యాల్లో బాలికను బెంచీకి కొట్టడం, కింద పడేసి తన్నడం, రాళ్లు, ఇటుకలు, పూలకుండీతో దాడి చేయడం కనిపించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. చిన్నారి స్పృహ కోల్పోయినప్పటికీ దాడి కొనసాగినట్లు తెలుస్తోంది.

ఆసుపత్రిలో పోరాటం.. తల్లిదండ్రుల్లో ఆందోళన

తీవ్రంగా గాయపడిన బాలికను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్యం కోసం చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం చిన్నారి చికిత్స పొందుతోంది. బడికి పంపితే సురక్షితంగా ఉంటుందనే నమ్మకంతో పిల్లలను అప్పగించే తల్లిదండ్రులకు ఈ ఘటన ఆందోళన కలిగిస్తోంది. తమ బిడ్డకు ఏం జరిగిందో తెలుసుకోవాల్సిన పరిస్థితి రావడం ఆ కుటుంబానికి తీరని వేదనగా మారింది.

పర్యవేక్షణ ఎక్కడ? బాధ్యత ఎవరిది?

ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు బయటకు రావడంతో పాఠశాల నిర్వహణపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. తరగతి గదిలో చిన్నారులు ఉన్న సమయంలో ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉందా? ఇంతటి దాడి జరుగుతున్నా సిబ్బంది ఎందుకు గుర్తించలేకపోయారు? పాఠశాలలో విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు? అనే అంశాలు చర్చనీయాంశమయ్యాయి.

పిల్లల ప్రవర్తన వెనుక కారణాలేంటి?

ఈ ఘటనలో దాడికి పాల్పడిన బాలుడి వయసు కూడా

ఆలోచించాల్సిన అంశమే. ఎనిమిదేళ్ల వయసులో ఇంతటి హింసాత్మక ప్రవర్తనకు దారితీసిన పరిస్థితులేంటి? పిల్లలపై కుటుంబ వాతావరణం, చుట్టూ కనిపించే హింసాత్మక దృశ్యాలు, మానసిక ఒత్తిళ్లు ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి? అనే కోణాల్లోనూ పరిశీలించాల్సిన అవసరముంది. తప్పు చేసిన చిన్నారిని శిక్షించడమే కాకుండా, అతడి ప్రవర్తన వెనుక కారణాలను గుర్తించి తగిన మానసిక సహాయం అందించడం కూడా ముఖ్యమే.

పోలీసుల విచారణ.. యాజమాన్యంపై ఆరా

ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దాడికి గల కారణాలు, ఘటన సమయంలో పాఠశాలలో ఉన్న సిబ్బంది వివరాలు, పర్యవేక్షణలో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. పాఠశాల యాజమాన్యం, సంబంధిత విద్యార్థి తల్లిదండ్రులను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. హర్యానా విద్యాశాఖ కూడా విచారణకు చర్యలు చేపట్టినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. బడి గేటు దాటిన తర్వాత కూడా బిడ్డ భద్రతకు భరోసా ఉండాలి. పుస్తకాలతో పాటు మానవత్వాన్ని నేర్పించాల్సిన పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం కావాలి. ఆరేళ్ల చిన్నారి త్వరగా కోలుకుని మళ్లీ తన బాల్యాన్ని ఆనందంగా గడపాలని కోరుకుందాం.

జైల్ బ్రేక్ ఘటన.. సీఎం విజయ్ కీలక ఆదేశాలు

చెన్నై: తమిళనాడులోని తేని జిల్లా తెక్కంపట్టి సబ్ జైలు నుంచి సినీఫక్కీలో 17మంది ఖైదీలు పారిపోయిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గానూ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అంతేకాదు.. జైళ్ల శాఖలో భారీగా బదిలీలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. భద్రతా లోపాలకు కారణమైన ఇతర అధికారులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ ఘటన నేపథ్యంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ టీవీకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని మండిపడ్డారు. చెన్నైలోని ప్రముఖ ప్రాంతాలలో జరుగుతున్న హత్యలు, పిల్లలపై లైంగిక హింస, జైలు నుంచి ఖైదీలు పారిపోవడం వంటి ఘటనలే ఇందుకు ఉదాహరణలని దుయ్యబట్టారు. శాంతిభద్రతల పరిస్థితి, పెరుగుతున్న ధరలకు నిరసనగా అక్టోబర్ 31న రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ మహిళా విభాగం నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. విజయ్ హీరోయిజం సినిమాల్లోలాగానే నిజజీవితంలోనూ కనిపిస్తుందనే ఆశతో ప్రజలు ఆయనకు ఓటు వేశారని అన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులు చూసి వారు నిరాశ చెందుతున్నారని విమర్శించారు. అక్టోబరు 26న రాత్రి జైలు సిబ్బందిపై దాడి చేసి.. 17 మంది ఖైదీలు తప్పించుకున్న సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు 20కి పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పారిపోయిన వారందరినీ పట్టుకున్నారు. ప్రస్తుతం వారందరినీ రాష్ట్రంలోని అత్యంత భద్రత కలిగిన కేంద్ర కారాగారాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జైళ్లలో సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు.

ఏపీ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

విజయవాడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అఫిడవిట్లు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నట్లు హైకోర్టుకు ఎస్ఈసీ నివేదించింది. ఈమేరకు ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ అఫిడవిట్ దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఆన్‌లైన్‌లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చామని.. పోర్టల్ ద్వారా మున్సిపల్, గ్రామీణ స్థానిక సంస్థల అభ్యర్థుల వివరాలు వీక్షించే అవకాశం ఉందని ఎస్ఈసీ పేర్కొంది. మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు,వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పామన్న ఎస్ఈసీ.. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, సెల్ఫ్ అఫిడవిట్లు కూడా వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించాం. పోలింగ్ తేదీకి ముందుగానే అభ్యర్థుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని చెప్పామని తెలిపింది. భారీ స్థాయిలో ఉండే డేటా దృష్ట్యా పీఆర్ అండ్ ఆర్డీ, మున్సిపల్ శాఖల అధికారిక వెబ్‌సైట్ల ద్వారా సమాచారం అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించాం. సంబంధిత శాఖల వెబ్‌సైట్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి లింకులు. నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించామని ఎస్ఈసీ తెలిపింది.. ఈ మేరకు పీఆర్ అండ్ ఆర్డీ, మున్సిపల్ శాఖల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది.

దేశం సంక్షోభంలో ఉంటే.. వారు సంతోషిస్తారు

ఢిల్లీ : ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయంగా సంక్షోభం నెలకొన్న సమయంలో దేశంలో విపక్షాలు వదంతులు వ్యాప్తి చేస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ ధ్వజమెత్తారు. ప్రజల్లో భయాందోళన సృష్టించేందుకు వారు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గుజరాత్‌లోని బనస్కాంతలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ 24వ విడత నిధులను విడుదల చేసిన సందర్భంగా ప్రతిపక్ష పార్టీల చర్యలను ఖండించారు.

"దేశంలో ప్రజలంతా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంటే.. కొన్ని రాజకీయ వర్గాలు దేశ ప్రగతి పట్ల అసంతృప్తిగా ఉన్నాయి. దేశం ఇబ్బందుల్లో పడాలని వారు కోరుకుంటున్నారు. గల్ఫ్ ఉద్రిక్తతల కారణంగా అనిశ్చిత పరిస్థితులుంటే.. ఎరువులు, గ్యాస్ కొరత గురించి వదంతులు వ్యాప్తిచేస్తున్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి.. మోదీని దెబ్బతీయాలన్నది వారి ప్లాన్. దేశం కష్టాల్లో ఉండాలని కోరుకునే వీరు.. సంక్షోభ సమయాల్లో సంతోషిస్తారు" అని విపక్షాలపై మోదీ మండిపడ్డారు. రైతులకు అండగా ఉంటామని గతంలో ఇచ్చిన హామీకి తగ్గట్టే తమ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని ప్రధాని ఈ సందర్భంగా చెప్పారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరిగినా ఆ భారాన్ని రైతులపై పడనివ్వడం లేదని గుర్తు చేశారు.

పీఎం కిసాన్ నిధుల జమ.. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 24వ విడతలో సుమారు రూ.19వేల కోట్లను ప్రధాని మోదీ నేడు విడుదల చేశారు. ఆ నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. దీని కింద దేశవ్యాప్తంగా 9.34 కోట్లమంది రైతులు లబ్ధిపొందారు.

ఆర్ఓల 'తీర్పు'నకు ఎన్నికల తర్వాతే పరీక్ష!

- ఉపసంహరించుకోకపోయినా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారంటూ ఆరోపణలు..
- అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గారంటున్న పిటిషనర్లు!

నామినేషన్ల తిరస్కరణకు న్యాయపరీక్ష ఎప్పుడో..

- హైకోర్టులో పిటిషన్లు కొట్టివేత..
- ఎన్నికల ట్రిబ్యునల్ వైపు బాధిత అభ్యర్థులు
- కోర్టుల జోక్యానికి అవకాశం లేదన్న ధీమాతోనే ఆర్ఓల ఇష్టారాజ్యమా?



అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల తిరస్కరణ వ్యవహారం రాజకీయ దుమారం రేపుతోంది. నామినేషన్ల పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు) వ్యవహరించిన తీరుపై అభ్యర్థులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు పోటీ చేసే అవకాశం లేకుండా అధికారులే అడ్డంకులు సృష్టించా రన్న ఆరోపణలతో కొందరు న్యాయ స్థానాలను ఆశ్రయించగా.. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధిత అభ్యర్థులను మరో న్యాయపోరాటం వైపు మళ్లిం చింది. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న దశలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసిన ధర్మాసనం.. నామినేషన్ల తిరస్కరణపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. దీంతో తమకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటం చేసేందుకు అభ్యర్థులు ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కోర్టుల జోక్యానికి అవకాశం లేదా?

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత దానిని మధ్యలో నిలిపివేసేలా లేదా ప్రభావితం చేసేలా న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదన్నది ఈ వ్యవహారంలో కీలకమైన న్యాయపరమైన అంశం. ఈ సూత్రాన్నే ప్రస్తావించిన రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు.. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో నామినేషన్ల తిరస్కరణపై న్యాయస్థానం జోక్యం చేసుకోవడానికి వీల్లేదని వాదించారు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత చట్టప్రకారం ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

ఆర్ఓలపై తీవ్ర ఆరోపణలు

మరోవైపు నామినేషన్ల తిరస్కరణ, ఉపసంహరణల విషయంలో ఆర్ఓలు ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాము ఉపసంహరణ పత్రాలు సమర్పించకపోయినా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారని, నామినేషన్లు తిరస్కరించినప్పుడు అందుకు సంబంధించిన సమాచారం, కారణాలు సైతం తమకు సక్రమంగా తెలియజేయలేదని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి కొందరు అధికారులు నిర్ణయాలు తీసుకున్నారన్నది పిటిషనర్ల తరఫు వాదన. ఎన్నికల్లో పోటీ చేయాలన్న అభ్యర్థుల ఆకాంక్షకు అధికారుల నిర్ణయాలే అడ్డంకిగా మారాయని, నామినేషన్ల పరిశీలన నుంచి ఉపసంహరణ వరకు నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉంది.

తీర్పు ఆర్ఓలకు క్లీన్‌చిట్ కాదు!

హైకోర్టు పిటిషన్లను కొట్టివేయడాన్ని ఆర్ఓలు తీసుకున్న నిర్ణయాలకు న్యాయస్థానం ఆమోదముద్ర వేసినట్లుగా భావించడానికి వీల్లేదు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న దశలో న్యాయస్థానం జోక్యం చేసుకోలేదన్నదే ప్రస్తుత తీర్పులోని ప్రధాన అంశం. నామినేషన్ల తిరస్కరణలో నిబంధనలు పాటించారా? అభ్యర్థులకు తగిన సమాచారం ఇచ్చారా? ఉపసంహరణలు నిజంగానే అభ్యర్థుల సమ్మతితో జరిగాయా? అధికారుల నిర్ణయాల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇంకా రావాల్సి ఉంది.

ట్రిబ్యునల్ విచారణపైనే ఆశలు!

ప్రస్తుతానికి హైకోర్టు నుంచి ఊరట లభించకపోవడంతో బాధిత అభ్యర్థులకు ఎన్నికల ట్రిబ్యునల్ తదుపరి న్యాయవేదికగా మారింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం చట్టప్రకారం దాఖలయ్యే ఎన్నికల పిటిషన్ల విచారణలో నామినేషన్ల తిరస్కరణకు సంబంధించిన అంశాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. అయితే అప్పటివరకు అభ్యర్థులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాస్వామ్య ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం ఎంత ముఖ్యమో, నామినేషన్లను తిరస్కరించేటప్పుడు నిబంధనలను తూచా తప్పకుండా పాటించడం కూడా అంతే ముఖ్యం. అధికారుల నిర్ణయాలపై అనుమానాలు వ్యక్తమైనప్పుడు వాటికి పారదర్శకమైన సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంటుంది. హైకోర్టు తీర్పుతో తాత్కాలికంగా న్యాయపోరాటానికి విరామం లభించినా.. నామినేషన్ల తిరస్కరణ వెనుక అసలు వాస్తవాలు ఏమిటన్న ప్రశ్న మాత్రం ఇంకా మిగిలే ఉంది. ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల ట్రిబ్యునల్ విచారణపైనే!

ఏకగ్రీవాల మాటున ఏం జరిగింది?

- స్థానిక ఎన్నికల్లో కూటమి ఏకపక్ష విజయాలపై రాజకీయ దుమారం!
- పులివెందుల నుంచి పల్నాడు వరకు ఏకగ్రీవాల లెక్కలపై చర్చ.. నామినేషన్ల ప్రక్రియపై విపక్షాల అభ్యంతరాలు



అమరావతి : అధికారం చేతిలో ఉంది.. అధికార యంత్రాంగం అండగా ఉందనే ఆరోపణలు.. అయినా స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలపైనే ఇంత చర్చ ఎందుకు? రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు భారీ సంఖ్యలో ఏకగ్రీవం కావడం రాజకీయంగా కలకలం రేపుతోంది. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీకి బలముందని భావించే పులివెందుల, పల్నాడు ప్రాంతాల్లో వెలువడిన ఫలితాలు కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. నామినేషన్ల దశలోనే ప్రత్యర్థులకు అడ్డంకులు ఎదురయ్యాయన్న విపక్షాల ఆరోపణలు, అభ్యర్థుల ఉపసంహరణలపై వివాదాలు ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను చర్చనీయాంశంగా మార్చాయి. నిజంగానే ఇవి ప్రజల ఏకాభిప్రాయానికి నిదర్శనమా? లేక ఎన్నికల నిర్వహణలోని లోపాలపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందా?

గణాంకాల్లో కూటమి ఆధిపత్యం!

రాష్ట్రవ్యాప్తంగా ఏకగ్రీవమైన ఎంపీటీసీ స్థానాల వివరాలు రాజకీ య వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. అందుబాటులో ఉన్న గణాం కాల ప్రకారం, 9,829 ఎంపీటీసీ స్థానాలకు గాను 1,985 స్థానాలు ఏకగ్రీవమైనట్లు తెలుస్తోంది. వీటిలో టీడీపీకి 1,781, జనసేనకు 101, బీజేపీకి 52, వైఎస్సార్‌సీపీకి 93 స్థానాలు దక్కినట్లు పేర్కొంటున్నారు.

పులివెందుల ఫలితాలపై ప్రశ్నలెన్నో!

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో 65 ఎంపీటీసీ స్థానాలకు గాను 64 స్థానాలు టీడీపీకి ఏకగ్రీవమైనట్లు చెబుతున్నారు. ఈ పరిణామంపై విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఏకగ్రీవాలకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అభ్యర్థుల నామినేషన్లు, ఉపసంహరణల వివరాలు ఏమి చెబుతున్నాయి? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

పల్నాడులోనూ అదే పరిస్థితి! : మాచర్ల, నరసరావుపేట, పెదకూరపాడు, గురజాల నియోజక వర్గాల్లో ఎంపీటీసీ స్థానాలన్నీ కూటమి ఖాతాలోకి వెళ్లినట్లు అందిన సమాచారం చెబుతోంది. ఈ ప్రాంతాల్లో ఏకగ్రీవాలు ఎలా సాధ్యమయ్యాయన్నదానిపై రాజకీయ చర్చ కొనసాగుతోంది. అయితే ఏకగ్రీవాల సంఖ్య మాత్రమే అక్రమాలకు రుజువు కాదు. నామినేషన్లు, ఉపసంహరణలు, అభ్యర్థుల ఫిర్యాదులపై అధికారిక రికార్డుల పరిశీలన అవసరం.

నామినేషన్ల దగ్గరే ప్రజాస్వామ్యానికి పరీక్ష!

నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు, అభ్యర్థుల సమ్మతి లేకుండానే ఉపసంహరణలు జరిగాయనే ఫిర్యాదులు ఎన్నికల ప్రక్రియపై అనుమానాలను పెంచుతున్నాయి. ఈ ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణలను కొట్టిపారేయడం కాకుండా, వాటిపై నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంది.

ఏకగ్రీవమే అంతిమ తీర్పు కాదు!

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు చట్టబద్ధంగా జరిగితే అభ్యంతరాలకు తావుండదు. కానీ పోటీ చేసే అవకాశం నిరాకరించ బడిందన్న ఆరోపణలు వస్తే వాటిని తీవ్రంగా పరిశీలించాలి. రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకోవడం కంటే, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం అధికార పార్టీలకు, ఎన్నికల యంత్రాంగానికి మరింత కీలకం. ఏకగ్రీవాల వెనుక ఉన్న వాస్తవాలేమిటి? రాజకీయ ఆరోపణలకు సమాధానం చెప్పేది ప్రకటనలు కాదు.. పారదర్శకమైన ఎన్నికల రికార్డులే!

మండల కాలం కోసం శబరిమల దర్శనం టిక్కెట్లు విడుదల

పతనంతిట్ట: ట్రావెన్కోర్ దేవస్వం బోర్డ్ (టీడీబీ) రాబోయే శబరిమల మండల కాలం యాత్రా కాలం కోసం, తమ నవీకరించిన ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్ www.sabarimalaonline.org ద్వారా వర్చువల్ క్యూ దర్శనం బుకింగ్ స్లాట్లను విడుదల చేసింది. చిత్తిర అత్తతిరునాల్ ఉత్సవం సందర్భంగా నవంబర్ 6, 7 తేదీలకు దర్శన స్లాట్లు విడుదలయ్యాయి. నవంబర్ 17 నుంచి డిసెంబర్ 25 వరకు జరిగే మండల యాత్రకు కూడా బుకింగులు అందుబాటులో ఉన్నాయి.

యాత్రికుల రద్దీని నియంత్రించే లక్ష్యంతో, మండల పూజ కాలం సహా డిసెంబర్ 26, 27 తేదీల వర్చువల్ క్యూ టిక్కెట్లను ఆంక్షలతో విడిగా విడుదల చేయనున్నారు. మకరవిళక్కు మహోత్సవం దర్శనం బుకింగులు డిసెంబరులో విడుదలయ్యే అవకాశం ఉంది. ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు, శబరిమల వర్చువల్ క్యూ వెబ్‌సైట్ ఇంటర్ఫేసును కూడా అప్‌గ్రేడ్ చేసింది. ఇందులో భాగంగా, బుకింగ్ ప్రక్రియలో మార్పులు ప్రవేశపెట్టింది. వీటిలో ప్రతి యాత్రికుడికి తప్పనిసరిగా ట్రెకింగ్ మార్గాన్ని ఎంచుకోవడం, నామినీ వివరాలు నమోదు చేయడం వంటివి ఉన్నాయి.

బుకింగ్ విధానం ఇలా..

సవరించిన బుకింగ్ విధానం ప్రకారం.. యాత్రికులు దర్శన స్లాట్లను రిజర్వ్ చేసుకునేటప్పుడు తాము వెళ్లాలనుకుంటున్న ట్రెక్కింగ్ మార్గాన్ని ఎంచుకోవాలి. పంపా గుండా ప్రయాణించేవారు పంపా-మరక్కూటం మార్గాన్ని ఎంచుకోవచ్చు, అయితే ఎరుమేలి నుంచి సాంప్రదాయ అటవీ మార్గంలో వెళ్లే యాత్రికులు ఎరుమేలి--కలకెట్టి సాంప్రదాయ మార్గాన్ని ఎంచుకోవచ్చు. వండిపెరియార్, సత్రం, పుల్మేడు గుండా ప్రయాణించే భక్తులు వండిపెరియార్-సత్రం-పుల్మేడు మార్గాన్ని ఎంచుకోవచ్చు.

మరో ముఖ్యమైన మార్పు ఏమిటంటే, నామినీ వివరాలను తప్పనిసరిగా అందించాలనే నిబంధనను ప్రవేశపెట్టడం. యాత్రికులు ఇప్పుడు బుకింగ్‌లో చేర్చిన ప్రతి వ్యక్తికి ఒక నామినీ పేరును తప్పనిసరిగా అందించాలి. యాత్రికుల భద్రతాపరమైన ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిబంధనను ప్రవేశపెట్టారు.

ఈ పోర్టల్ ప్రస్తుతం ఉన్న ఆన్లైన్ ప్రసాద బుకింగ్ సదుపాయాన్ని అందిస్తూనే ఉంది. దీని ద్వారా యాత్రికులు తమ దర్శన బుకింగ్‌లతో పాటు అరవాణ, అప్పం, అభిషేకం నెయ్యి, పసుపు, కుంకుమ, విభూతిని కూడా రిజర్వ్ చేసుకోవచ్చు.

బుకింగ్ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత, యాత్రికులకు కొత్త ఫార్మాట్లో రసీదు అందుతుంది. ఆన్‌లైన్‌లో ప్రసాదం బుక్ చేసుకున్న వారు, తమ ప్రసాదం బుకింగ్ రసీదును చూపించి, సన్నిధానంలోని నిర్దేశిత ప్రసాద పంపిణీ కౌంటర్ల నుంచి తమ ప్రసాదాన్ని స్వీకరించవచ్చు. పంబ గుండా ప్రయాణించే యాత్రికులు

సన్నిధానం వైపు వెళ్లే ముందు , ధ్రువీకరణ కోసం తమ వర్చువల్ క్యూ టిక్కెట్లను పంబ తనిఖీ కౌంటర్ వద్ద సమర్పించాలి. వర్చువల్ క్యూ దర్శనం బుకింగ్ పూర్తిగా ఉచితం. రిజర్వేషన్ ప్రక్రియ సమయంలో, యాత్రికులు స్వచ్ఛందంగా యాత్రికుల సహాయ నిధికి రూ. 5 లేదా అంతకంటే ఎక్కువ విరాళంగా ఇవ్వవచ్చు. ఈ విరాళం తప్పనిసరి కాదు. పారిశుధ్యం, పరిశుభ్రత కోసం ఏర్పాటు చేసిన సాధారణ నిధికి విరాళాలు ఇవ్వడం కూడా ఐచ్ఛికమే.

మండల - మకరవిళక్కు సీజన్ కోసం, రోజువారీ వర్చువల్ క్యూ బుకింగ్ పరిమితిని 66,000 మంది యాత్రికులుగా నిర్ణయించారు. ఇందులో నీలక్కల్ - పంబ మార్గం ద్వారా 60,000 స్లాట్లు , ఎరుమేలి సాంప్రదాయ అటవీ మార్గం ద్వారా 3,000, వండిపెరియార్ సత్రం మార్గం ద్వారా 3,000 స్లాట్లు ఉన్నాయి.

అదనంగా , ప్రతిరోజూ స్పాట్ బుకింగ్ సౌకర్యాల ద్వారా 14,000 మంది యాత్రికులకు వసతి కల్పిస్తారు. వీరిలో , నిలక్కల్లో 10,000 స్లాట్లు అందుబాటులో ఉండగా, ఎరుమేలి, వండిపెరియార్ సత్రంలో చెరో 2,000 స్లాట్లు అందిస్తారు. ఈ ఆన్‌లైన్ స్పాట్ బుకింగ్ ఏర్పాట్లు కలిపి రోజుకు 80,000 మంది యాత్రికులకు వసతి కల్పిస్తాయి. అయితే, రద్దీని తగ్గించి, యాత్రికుల రాకపోకలను మెరుగుపరచాలన్న కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు , యాత్రా కాలంలో పంబలో స్పాట్ బుకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉండవు. ముందుగా వర్చువల్ క్యూ రిజర్వేషన్లు చేసుకోని భక్తులు నీలక్కల్, ఎరుమేలి లేదా వండిపెరియార్ సత్రంలోని నిర్దేశిత స్పాట్ బుకింగ్ కేంద్రాలను ఉపయోగించుకోవాలి.

శబరిమల సందర్శనకు వెళ్లే యాత్రికులకు ఒక సూచన: తమ దర్శన స్లాట్లను ముందుగానే బుక్ చేసుకోవాలి, సరైన ట్రెక్కింగ్ మార్గాన్ని ఎంచుకోవాలి, నామినీ వివరాలను సరిగ్గా అందించాలి. ధ్రువీకరణ, స్వీకరణ కోసం తమ దర్శన , ప్రసాదం బుకింగ్ రసీదులను సిద్ధంగా ఉంచుకోవాలి.

తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో అర్నబ్ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి యంత్రాంగం ,సిబ్బంది వరకు బుధవారం తెల్లవారుజామున నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అర్నబ్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై ఆరా తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు 5 వేల హెక్టార్లలో అరటి పంట, 8 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు ధ్వంసమైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను కేంద్రానికి వివరించడంతో పాటు, పంట నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. ఎక్కడైనా ప్రాణనష్టం సంభవించిందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు సీఎంకు నివేదించారు. చెరువులు పొంగిపొర్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సాగునీటి సంఘాలతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. తుఫాన్ షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్న వారిని పరిస్థితులు పూర్తిగా కుదుటపడిన తర్వాతే ఇళ్లకు పంపాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

పొంగి ప్రవహిస్తున్న ఖండి కాలువ..

గండేపల్లి: అర్నబ్ తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జెడ్.రాగంపేట ఎల్లమిల్లి, మల్లేపల్లి, నీలాద్రిరావు పేట తదితర గ్రామాల్లోని వరి పంట నీట మునిగింది. తాళ్లూరు, జెడ్. రాగంపేట గ్రామాల్లోని ఖండి కాలువ పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్నది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గండేపల్లి మండలంలోని 18 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడి, తాగు నీటి సమస్యలు ఏర్పడ్డాయి.

గత రెండు రోజులుగా వర్షంలోనే ధాన్యం

గండేపల్లి మండలంలో గత 15 రోజులుగా వరి కోతలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం అర్నబ్ తుపాను కారణంగా ఇప్పటికే పంటను కోసిన రైతులు పంటను పరదాలు కప్పి కాపాడుకుంటున్నారు. వందల బస్తాలు రెండు రోజులుగా వర్షానికి తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి తగిన న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. మండలంలో 8308 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టగా ఇప్పటి వరకు 2800 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. రెండు రోజులుగా కురిస్తున్న వర్షానికి 3200 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

భారీ వర్షాలు, పెనుగాలులతో బీభత్సం!

విజయవాడ: అర్నబ్ తుఫాను ప్రభావంతో కృష్ణా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి పలు గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. కోనసీమ జిల్లాలోని 19 మండలాల పరిధిలో వందలాది చెట్లు కూలినట్లు సమాచారం. రహదారులపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. కాకినాడ జిల్లాలోని మహాలక్ష్మీనగర్, ముత్తానగర్, ఉప్పాడ, సుబ్బంపేట, సూరాడపేట ప్రాంతాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకొచ్చినట్లు సమాచారం. పలు ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

అమరావతి: అర్నబ్ తుపాను సృష్టించిన విధ్వంసం మరువక ముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. బుధవారం దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం ఉదయం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణశాఖ తెలిపింది. 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న అండమాన్-నికోబార్ దీవులు, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దీని గమనాన్ని డాప్లర్ వెదర్ రాడార్ ద్వారా వాతావరణ శాఖ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

భూటాన్‌లో హిమానీనదం విస్ఫోటనం

భూటాన్ దేశంలోని గాసా జిల్లాలో షింటావు సరస్సు ఉప్పొంగి వరద సంభవించింది. దాంతో పశ్చిమబెంగాల్, అస్సాంలోని కొన్ని ప్రాంతాలకు ఆకస్మిక వరద హెచ్చరికలు జారీఅయ్యాయి. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనవల్ల గాసా జిల్లాలోని మోచు నది ఒడ్డున ఉన్న ప్రసిద్ధ సహజ వేడినీటి బుగ్గ అయిన గాసా త్సాచులోని సౌకర్యాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. అయితే ముందుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

మోచు నది ప్రారంభంలోనే ఉన్న షింటావు సరస్సు భూటాన్‌లోని 17 ప్రమాదకరమైన హిమానీనద సరస్సులలో ఒకటి. 2021 ఆగస్టు 26న మోచు నది ఉప్పొంగడంతో గాసా త్సాచు ఆకస్మిక వరదకు కొట్టుకుపోయింది. పునాఖా జోంగ్ నుంచి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న కబేసా గెవాగ్‌లోని శ్రీగాంగ్‌ను ఇపుడు వరదనీరు దాటింది. భూటాన్ సరిహద్దు జిల్లాల్లో ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉండటంతో మనదేశంలో కూడా పశ్చిమబెంగాల్, అస్సాం ప్రభుత్వాలను కేంద్రం అప్రమత్తం చేసింది.

అస్సాంలోని ధుబ్రి, పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతాలు, అలాగే అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి జిల్లాలు ఈ ముప్పు పొంచి ఉన్న వాటిలో ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లోని కూచ్ బెహార్‌లో, సంకోష్ నది ఒడ్డున ఉన్న ప్రజలు ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించారు.

హిమానీనదం విస్ఫోటనం అంటే పూర్వపు హిమానీనదాల పక్కన సరస్సులుగా పేరుకుపోయిన మంచు అకస్మాత్తుగా కరిగి ఉప్పొంగడం. హిమానీనదాలు ఉధృతంగా ప్రవహించి ఆ తర్వాత ప్రవాహం తగ్గడంతో ఇలాంటి సరస్సులు ఏర్పడుతాయి. ఇది సహజంగా సంభవించే ఒక దృగ్విషయం. కానీ మానవ ప్రేరిత వాతావరణ మార్పులతో పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఇవి విస్ఫోటనం చెందుతున్నాయి. అధిక నీటిని నిల్వతో ఉండే ఈ సరస్సులు అకస్మాత్తుగా ఉప్పొంగడంతో ప్రమాదకరమైన వరదలు సంభవిస్తాయి. భారీ వర్షపాతం, కొండచరియలు విరిగిపడటం, హిమసంపాతాలు, భూకంపాలు, హిమానీనదాలు కరగడం లాంటి కారణాలవల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయి.

డిజిటల్ మోసాల బాధితులకు బ్యాంకులు పరిహారం చెల్లించాల్సిందే

న్యూఢిల్లీ : డిజిటల్ మోసాల బాధితులు నష్టపోతే అందుకు బ్యాంకులే బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. బాధితులను రక్షించాల్సిన బాధ్యత ఆర్థిక సంస్థలదేనని కోర్టు పేర్కొంది. తగిన శ్రద్ధ వహించడంలో బ్యాంకులు విఫలమవ్వడం వల్ల మోసం జరిగినట్టు రుజువైతే డిజిటల్ అరెస్టు స్కామ్‌ల వంటి నేరాల బాధితులకు కనీసం వారు కోల్పోయిన మొత్తానికైనా పరిహారం చెల్లించాలని న్యాయస్థానం తెలిపింది.

ఖాతాదారుని నిర్ధారిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలను స్వయంచాలకంగా సమాచారం అందచేయడం, లావాదేవీల ప్రామాణికతను నిర్ధారించడానికి భౌతిక ధృవీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల ఆవశ్యకతను ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనలతో కూడిన ధర్మాసనం పునరుద్ఘాటించింది.

బాధితులను రక్షించడం బ్యాంకర్లుగా మీ బాధ్యత. మరి మీ అధికారిక వ్యవస్థ ఏం చేస్తున్నది? అని సీజేఐ ప్రశ్నించారు. బహుశా పెద్ద కంపెనీలకు సంబంధించిన లావాదేవీలను మీరు గుర్తించలేకపోవచ్చు. కానీ సాధారణంగా ఒకసారికి రూ.10,000 లేదా రూ.20,000 మాత్రమే విత్‌డ్రా చేసే వ్యక్తి అకస్మాత్తుగా రూ.50,000 విత్‌డ్రా చేసినప్పుడు ఆ లావాదేవీని గుర్తించకూడదా? అని ఆయన ప్రశ్నించారు. స్వయంగా చేపట్టిన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై విచారణ జరుపుతున్నప్పుడు ఆర్థిక సంస్థలు తగిన శ్రద్ధ చూపడంలో, బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్టు తేలితే ప్రతిపాదిత నియంత్రణ చట్టం బాధితులకు తగిన పరిహారం అందించేలా ఉండాలని ధర్మాసనం నొక్కిచెప్పింది.

డిజిటల్ అరెస్టు మోసాలు కొనసాగుతుండటంపై కోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి మోసాలకు ఎలా బలి అవుతున్నారని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. డిజిటల్ అరెస్టుల విషయంలో వీరు దేనికి భయపడుతున్నారు? ఇది ఒక రకమైన భయాందోళన స్థితి. ప్రజలు ఇలా ఎలా చిక్కుకుపోతున్నారు? ఎవరో ఫోన్ చేసి మిమ్మల్ని అరెస్టు చేశాం అని చెబితే దాన్ని మీరు నిజమని ఎలా నమ్మేస్తున్నారు? మన దేశంలో ఇలాంటి మోసాలకు ప్రజలు ఎలా బాధితులు అవుతున్నారు? ఇక రాబోయే తరాలకు మీరు ఏమి అందించగలరు? అని సీజేఐ ప్రశ్నించారు.

తదుపరి విచారణ తేదీ నాటికి అన్ని అధికారిక ఆర్థిక సంస్థల జాబితాను సమర్పించాలని ఆర్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, వ్యక్తిగత బ్యాంకులను విడిగా ఈ విచారణ ప్రక్రియలో భాగం చేయాల్సిన అవసరం లేకుండానే అన్ని సంస్థలకు వర్తించేలా ఆదేశాలు జారీ చేస్తామని కోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను కూడా ధర్మాసనం కోరింది. డిజిటల్ అరెస్టు మోసాల బాధితులుగా ఉండే అవకాశం ఉన్న కస్టమర్లకు సంబంధించిన అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత బ్యాంకులదేనని కూడా ధర్మాసనం నొక్కి చెప్పింది.

15 ఏండ్ల లోపు వారికి కోచింగ్ బంద్

బెంగళూరు : కోచింగ్/ట్యుటోరియల్ సెంటర్లపై కర్ణాటక ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. 15 ఏండ్ల లోపు విద్యార్థులకు కోచింగ్ సెంటర్లలో ప్రవేశాన్ని నిషేధించడమే కాక, విద్యార్థులు చెల్లించాల్సిన మొత్తం ఫీజును కనీసం నాలుగు విడతలలో చెల్లించే వెసులుబాటును కల్పించింది. విద్యార్థి వైదొలగిన 10 రోజులలో నిర్వహించని తరగతులకు సంబంధించిన ఫీజును వాపసు ఇవ్వాలని తెలిపింది. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదిత ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. కర్ణాటక ట్యుటోరియల్ సంస్థలు, కోచింగ్ సెంటర్ల (నమోదు, నియంత్రణ) నిబంధనలు 2026ను బుధవారం గెజిట్‌లో ప్రచురించింది. ఈ కొత్త ప్రతిపాదనల ప్రకారం ప్రతిరోజూ గరిష్ఠంగా 5 గంటలు మాత్రమే కోచింగ్ ఇవ్వాలి. దీనిని అతిక్రమిస్తే ఐదు లక్షల వరకు జరిమానా విధిస్తారు.దకోచింగ్ సెంటర్ కార్యకలాపాలను ప్రారంభించే ముందు వాటిని తప్పనిసరిగా నమోదు చేయించాలి. ప్రస్తుతం నడుస్తున్న సంస్థలు 90 రోజుల్లోగా దీనికోసం దరఖాస్తు చేసుకోవాలి. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య మాత్రమే కోచింగ్ ఇవ్వాలి. అయితే పాఠశాలలు, కాలేజీలు పనిచేసే వేళల్లో తరగతులు నిర్వహించకూడదు. సెకండరీ స్కూల్ పరీక్ష పూర్తయిన విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్ కల్పించాలి. ర్యాంకులు, అత్యధిక మార్కుల పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టడాన్ని కొత్త నిబంధనలు నిరోధించాయి. అలాగే పరీక్ష ఫీజు మొత్తాన్ని ఒకేసారి వసూలు చేసే విధానానికి అడ్డుకట్ట వేసింది. కనీసం నాలుగు విడతలుగా ఫీజును చెల్లించే వెసులుబాటును విద్యార్థులకు కల్పించాలని పేర్కొంది. ఈ నిబంధనలన్నీ ఆయా కోచింగ్ సెంటర్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తప్పక తెలియజేయాలి. రిఫండ్ పాలసీలు, స్టూడెంట్ల సంఖ్య గురించి వెబ్‌సైట్లలో, నోటీస్ బోర్డులలో, ప్రాస్పెక్ట్‌లలో అప్‌డేట్ చేయాలి. పుస్తకాలు, స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయమని విద్యార్థులపై ఒత్తిడి తేరాదని నిబంధనల్లో స్పష్టం చేశారు.

టపాసులను పూర్తిగా నిషేధించలేం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : దీపావళి పండుగలో టపాసులను పూర్తిగా నిషేధించలేమని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ప్రజలకు ఆనందం కలిగించే ఏ అంశాన్ని కూడా పూర్తిగా రూపుమాపలేమని.. కాకపోతే పండుగ సందర్భంగా వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలని తెలిపింది. టపాసుల వల్ల కలిగే కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఇప్పటికే అమల్లో ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో పాటు కాలుష్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విరాట్ కోహ్లీ లాంటి ప్రముఖులను వినియోగించుకోవాలని ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది. కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఢిల్లీ ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది.

హింసాత్మక నిరసనల్లో పాల్గొంటే నో జాబ్

లక్నో : ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. హింసాత్మక నిరసనల్లో పాల్గొని ప్రభత్వాన్ని మార్చడానికి ప్రయత్నించే వారిని, అలాంటి సంస్థల్లో సభ్యత్వం ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులుగా గుర్తిస్తామని చెప్పింది. ఈ మేరకు అభ్యర్థుల క్యారెక్టర్ వెరిఫికేషన్‌లో కీలక సవరణలు చేసింది. అభ్యర్థికి 21ఏండ్లు నిండిన తర్వాత అతని గత మూడేండ్ల ప్రవర్తనపై వెరిఫికేషన్ చేస్తారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు ఇచ్చే సంస్థల్లో సభ్యత్వం ఉన్నా, అలాంటి నిరసనల్లో పాల్గొన్నా అతన్ని అనర్హుడిగా ప్రకటిస్తారు. వివిధ శాఖలు, కార్పొరేషన్లు, బోర్డులు, స్థానిక సంస్థల్లో నేరుగా భర్తీ చేసే కొలువులపై ఈ ప్రభావం పడనుంది. ఈ నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని విమర్శించాయి.

ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో రైతులకు అపార నష్టం

అమరావతి : అర్నబ్ తుపాను అన్నదాతకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయగోదావరి, కోస్తాంధ్రలో అపార నష్టాన్ని మిగిల్చింది. ప్రాథమిక లెక్కల ప్రకారం దాదాపు 6.21 లక్షల మంది రైతులకు చెందిన 9.38 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో 8.80 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 58వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే.. 12 లక్షల ఎకరాలకు పైగా పంటలు ఈ తుపాను ప్రభావానికి గురై..తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు.

ప్రాథమికంగా 291 మండలాల పరిధిలోని 7613 గ్రామాల్లో 5.42 లక్షల మంది రైతులకు చెందిన 8.80 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 215 మండలాల పరిధిలోని 1310 గ్రామాల్లో 78,967 మంది రైతులకు చెందిన 58,029 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రకటించారు. అత్యధికంగా 8.64 లక్షల ఎకరాల్లో వరి, 38,874 ఎకరాల్లో అరటి, 10 వేల ఎకరాల్లో కూరగాయలు, మరో 10 వేల ఎకరాల్లో మినుము, 4,498 ఎకరాల్లో పత్తి, 3,189 ఎకరాల్లో కొబ్బరి, 1,790 ఎకరాల్లో బొప్పాయి. 1,094 ఎకరాల్లో పసుపు, 966 ఎకరాల్లో పూల తోటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు.

మొక్కజొన్న, టమాటా, మిరప, పామాయిల్, పండ్ల తోటలకు కూడా అపార నష్టం వాటిల్లినట్టు అధికారులు తేల్చారు. ఉద్యాన పంట వరకు ఎస్‌డీ ఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.739.75 కోట్లు, వ్యవసాయ పంటలకు సుమారుగా రూ.వెయ్యి కోట్లు నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. ఇక 12 జిల్లాల్లో 46 ఆవులు, గేదెలు, 63 గొర్రెలు, మేకలు, 32 దూడలు, 7656 కోళ్లు మృతి చెందాయని లెక్కతేల్చారు. కాగా 140 షెడ్లు దెబ్బతిన్నట్టు గుర్తించారు. మరొకవైపు 9 జిల్లాల్లో 1884 పడవలు, 3224 వలలు దెబ్బతినగా, 11,483.39 ఎకరాల్లో ఆక్వా సాగుపై ఈ తుపాను తీవ్ర ప్రభావాన్ని చూపిందని ప్రకటించారు.

పశుసంవర్ధక శాఖకు రూ.50.38 లక్షలు, మత్స్యశాఖకు రూ.176.82 కోట్లు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. ఇదిలా ఉంటే ఒక్క తూర్పు గోదావరి జిల్లాలో 49,915 హెక్టార్లలోని వరి పంట నేలవాలి నీటిపాలైంది. 6,500 హెక్టార్లలోని అరటిపంట దెబ్బతింది. మినుములు 810 హెక్టార్లలో, ఇతర పంటలు 30 హెక్టార్లలో, ఉద్యానవన పంటలు 1,500 హెక్టార్లలో నీట మునిగాయి. మొత్తంగా జిల్లాలోని 80 వేల మందికిపైగా రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కోలుకోని కోనసీమ : అర్నబ్ సృష్టించిన విలయం నుంచి కోనసీమ ఇంకా కోలుకోలేదు. వేలాదిగా విద్యుత్ స్తంభాలు కూలడం, వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పల్లెలు, పట్టణాలు ఇంకా అంధకారంలోనే మగ్గుతున్నాయి. ఇళ్లల్లో దీపాలు వెలగక, ఫ్యాన్లు తిరగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గురువారం నాటికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంతో పాటు మూడు నాలుగు మండల కేంద్రాల్లో కొన్ని ప్రాంతాలకు మాత్రమే విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించగలిగారు.

తీర ప్రాంత మండలాల్లోని శివారు గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. మరోవైపు పట్టణాలు, పల్లెల్లో కరెంటు లేక, మోటార్లు పని చేయక తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఇళ్లు దెబ్బతిన్న ప్రజలు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

వరద ముంపులో ఇచ్ఛాపురం : అర్నబ్ తుపాను శ్రీకాకుళంపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా ఒడిశాకు ఆనుకుని ఉన్న ఇచ్ఛాపురం ప్రాంతాన్ని వరద ముంచెత్తింది. ఒడిశాలోని భగలట్టీ డ్యామ్ నుంచి నీరు కిందకు విడుదల చేయడంతో గురువారం ఉదయం 11 గంటల సమయానికి బాహుదా నదిలో వరద 86,458 క్యూసెక్కులకు చేరింది. బుధవారం అర్ధరాత్రి నుంచి బాహుదానది, పద్మనాభపురం(దండు) గెడ్డలు ఉప్పొంగడంతో ఇన్నేశుపేట, డొంకూరు, లక్ష్మీపురం, జగన్నాథపురం, శాసనాం, బిర్లంగి, బి.తోటూరు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లొద్దపుట్టి, తేలుకుంచి, రత్తకన్న, మశాఖపురం, బొడ్డబడ గ్రామాల్లోకి నీరు చొచ్చుకురావడంతో ఇళ్లు మునిగిపోయాయి.

దాదాపు 30 ఏళ్లు తర్వాత మళ్లీ ఇంత ఉపద్రవం వచ్చిందని చెబుతున్నారు. స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి పూర్తిగా జలమయం కావడంతో కోల్‌కత్తా నుంచి చెన్నై రాకపోకలు సాగించే లారీలు, బస్సులు ఎక్కడకక్కడే నిలిచిపోయాయి. మిగతా ప్రాంతాల్లోనూ పంటలు నీటమునిగాయి. బుధవారం వరకు వరి పంటకు 12921.37 హెక్టార్లలో నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌ల మీదకు నీరు చేరడంతో జిల్లా మీదుగా రాకపోకలు సాగించాల్సిన పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. హిరమండలంలోని వంశధార గొట్టా బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

విశాఖలో విధ్వంసం : విశాఖలోనూ అర్నబ్ తుపాను విధ్వంసం సృష్టించింది. జిల్లాలో 1130కిపైగా వృక్షాలు నేలమట్టమయ్యాయి. 309 విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. 34.4 హెక్టార్లలో వరి, ఇతర పంటలు ధ్వంస మవ్వగా.. 53.42 హెక్టార్లలో ఉద్యానపంటలు నాశనమయ్యాయి. అయితే.. ఇంతవరకూ పంట నష్టం అంచనా వేసేందుకు అధికారులు ఎవ్వరూ వ్యవసాయ క్షేత్రాల్ని సందర్శించలేదని రైతులు చెబుతున్నారు.

టోల్‌కు 20 కి.మీలోపు వాహనదారులకు రాయితీ పాస్

న్యూఢిల్లీ : జాతీయ రహదారిపై ఉండే టోల్‌ప్లాజాలకు 20 కి.మీ పరిధిలో నివసించే వాహనదారులు నవంబర్ 1 నుంచి రాయితీపై ఫాస్టాగ్ పాస్‌ను పొందవచ్చునని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంగళవారం ప్రకటించింది. మున్సిపల్ లేదా స్థానిక పట్టణ పరిమితుల వెలుపల ఉన్న టోల్‌ప్లాజాలకు రాయితీ పాస్ వార్షిక రుసుం రూ.1500 కాగా, మున్సిపల్ పరిమితుల్లోని వాటికి రూ.3,000గా ఉంటుందని మంత్రిత్వ శాఖ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. కొత్త నిబంధన ప్రకారం 20 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ చెల్లుబాటులో ఉన్న, పనిచేస్తున్న ఫాస్టాగ్ కలిగిన అర్హతగల వాణిజ్యేతర వాహన యజమానులు ఒక నిర్దిష్ట ప్లాజా గుండా ప్రయాణించడానికి ప్రస్తుతం ఉన్న నెలవారీ పాస్ లేదా రాయితీతో కూడిన లోకల్ పాస్‌ను ఎంచుకోవచ్చు. ఈ రాయితీ పాస్ కేవలం ఆ ప్లాజాకు మాత్రమే పరిమితం.

రుణమాఫీ కోరుతూ మహా రైతుల పాదయాత్ర

ముంబై : మహారాష్ట్రలో రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, 12 వేలమంది రైతులు ముంబై బాట పట్టారు. కరువు బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని, పంటల బీమా సొమ్మును వెంటనే చెల్లించాలని, క్రమం తప్పకుండా రుణాలు చెల్లించిన రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అహిల్యానగర్ జిల్లాలోని అకోలే తాలూకా నుంచి ప్రారంభమైన ఈ భారీ ర్యాలీలో మహారాష్ట్రలోని 20 జిల్లాలకు చెందిన రైతులు పాల్గొంటున్నారు. సుమారు వెయ్యి వాహనాలతో సాగుతున్న ఈ మహా పాదయాత్రకు అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) నాయకత్వం వహిస్తున్నది.

రామ్‌లీలా ర్యాలీని సాయంత్రంలోగా ముగించాలి

న్యూఢిల్లీ : ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న ర్యాలీ నిర్వహించేందుకు విపక్ష ఇండియా కూటమికి పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే ర్యాలీకి పలు కఠిన షరతులు విధించారు. సాయంత్రం 5 గంటల లోగా సభను ముగించాలని, రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేయరాదంటూ ఢిల్లీ పోలీసులు ఆంక్షలు పెట్టారు. ఓటును రక్షించండి, దేశాన్ని రక్షించండి నినాదంతో ఇండియా కూటమి నవంబర్ 1న భారీ ర్యాలీ నిర్వహించనుంది. సభకు హాజరైన వారు ప్రశాంతంగా ఉండాలని, ఎలాంటి హింసకు దిగరాదని, పౌరులకు ఎలాంటి అసౌకర్యం కలిగించరాదని పోలీసులు తెలిపారు. 5 గంటల లోగా సభను ముగించాలని, అలా చేయకపోతే సభికులను పంపేస్తామని పోలీసులు తమ ఎన్‌వోసీలో పేర్కొన్నారు.

3 నుంచి కేరళ ప్రైవేట్ బస్ ఆపరేటర్ల నిరవధిక సమ్మె

పాలక్కాడ్ : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందించడం ద్వారా తమకు కలిగిన నష్టాలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేరళం ప్రైవేట్ బస్ ఆపరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నవంబర్ 3 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు మంగళవారం పాలక్కాడ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ నెల 10న రవాణా శాఖ మంత్రి జాన్‌తో జరిపిన చర్చలు ఫలప్రదం కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకొన్నామని తెలిపారు. ప్రైవేట్ బస్సులు తిరిగే మార్గాల్లో విరాళాల సాయంతో ప్రభుత్వం బస్సులు నడపడం వల్ల తమ ఉపాధి దెబ్బతిందని వారు ఆరోపించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే నవంబర్ 3 నుంచి తాము బస్సులను నడపడం ఆపేస్తామన్నారు. తమ సమస్యలపై గత నెలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించడం లేదని వారు విమర్శించారు.

తుపాన్ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమరావతి: అర్నబ్ తుపాను తీవ్ర రూపం దాల్చి తీరానికి సమీపంలో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీస్తున్నందున, వరదలు సంభవించే ప్రమాదం ఉన్నందున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. సముద్రతీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, నదులు, వాగులు, వంకల పరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చేతికొచ్చిన పంట.. కళ్లముందే నీటిపాలు!

- అర్నబ్ తుపానుతో అన్నదాతకు తీరని నష్టం
- అప్పులు తీర్చే దారి లేక.. పెట్టుబడి చేతికందక రైతన్న ఆవేదన
- ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రానికి రూ.4,600 కోట్ల నష్టం

అమరావతి : రెప్పపాటు కాలంలో రైతన్న ఆశలను తుపాను తుడిచిపెట్టేసింది. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి విరుచుకుపడింది. కళ్లముందే పొలాలు నీట మునిగాయి.. నేలకొరిగిన పంటలను చూసి అన్నదాత గుండె చెరువవుతోంది. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలి? వచ్చే పంటకు పెట్టుబడి ఎక్కడి నుంచి తేవాలి? కుటుంబాన్ని ఎలా పోషించాలి? అన్న ప్రశ్నలు రైతు కుటుంబాలను వెంటాడుతున్నాయి. అర్నబ్ తుపాను ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించిన బీభత్సం రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.

రూ.4,600 కోట్ల నష్టం.. కోలుకోవడం ఎలా? : ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.4,600 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వరితో పాటు పలు వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అరటి, కొబ్బరి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన దిగుబడి కళ్ల ముందే నాశనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. అంధకారంలో గ్రామాలు

తుపాను బీభత్సానికి కోనసీమ జిల్లాలోనే సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు అంచనా. కాకినాడతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ వందలాది స్తంభాలు, విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ అధికారులకు సవాలుగా మారింది. జనజీవనం సాధారణ స్థితికి చేరుకోవడానికి సమయం పట్టే పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రాణనష్టం.. కుటుంబాల్లో తీరని విషాదం : తుపాను కారణంగా ఐదుగురు మృతి చెందినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రకృతి ప్రకోపం కొందరి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. మరోవైపు లక్షలాది మందిని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

అండ కోసం ఎదురుచూస్తున్న అన్నదాత : పంట నష్టంతో రైతు ఎదుర్కొంటున్న సమస్య కేవలం ఒక సీజన్‌కు సంబంధించినది కాదు. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు, కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులు, తదుపరి సాగుకు అవసరమైన మూలధనం.. ఇలా ఎన్నో బాధ్యతలు రైతు భుజాలపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అంచనా వేసి, అర్హులైన ప్రతి రైతుకూ పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రభుత్వ సాయంపైనే ఆశలు : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి నష్టాలను సమీక్షించారు. కేంద్ర బృందాలు కూడా రాష్ట్రానికి వచ్చి నష్టాన్ని అంచనా వేయనున్నాయి. తుపాను నష్టంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం కోరినట్లు కథనం పేర్కొంది. ప్రకృతి విపత్తు నుంచి బయటపడేందుకు రైతన్నకు కేవలం పరామర్శలు సరిపోవు.. సకాలంలో నష్టపరిహారం, పంటల పునరుద్ధరణకు సహకారం, తదుపరి సాగుకు ఆర్థిక భరోసా అవసరం. నేలను నమ్ముకున్న రైతు మళ్లీ నిలబడేలా ప్రభుత్వాలు అండగా నిలవాల్సిన సమయమిది.

అర్నబ్ బీభత్సం.. కోనసీమ అతలాకుతలం

అమలాపురం : అర్నబ్.. 1996 నాటి పెను తుపానును గుర్తు చేస్తోంది. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అప్పటి కాళరాత్రిని అర్నబ్ తిరిగి కళ్ల ముందుకు తీసుకొచ్చింది. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ప్రచండ గాలుల హోరు తీవ్రమైంది. అతి భారీ వర్షం కురుస్తోంది. సముద్రం ఉగ్రరూపం దాల్చగా అర్నబ్ తుపాను కోనసీమను వణికిస్తోంది.

తీరప్రాంతంలో గాలులు ప్రళయ భయంకరంగా వీస్తుండటంతో కొబ్బరి చెట్లు, భారీ వృక్షాలు, ఇంటి పైకప్పులు, హోర్డింగ్‌లు, నేలకొరుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడుతున్నాయి. సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరంలోని సరుగుడు తోటల్లోకి చొచ్చుకెళ్తున్నాయి. కుండపోత వర్షాలు, గాలుల తీవ్రతతో తీరప్రాంత మండలాలు అల్లకల్లోలంగా మారాయి. ఎప్పుడు ఏ చెట్టు కూలుతుందో.. ఎక్కడ ఏ విద్యుత్ స్తంభం నేలకొరుగుతుందోనన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

పెను తుపాను తీర ప్రాంత మండలాలపై విరుచుకుపడుతోంది. ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో గాలుల తీవ్రత అధికంగా ఉంది. ఉదయం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. సముద్ర అలలు గోదావరి నదీ పాయల ద్వారా చొచ్చుకుని వస్తున్నాయి. అలలు రావడంతో మురుగునీటి డ్రెయిన్లలో ముంపు నీరు గట్లు దాటుతోంది. గాలుల తీవ్రత చూస్తుంటే 1996 పెను తుపాను సమయంలో వచ్చినట్టుగా ఉప్పెన రానుందని మత్స్యకారులు భయపడుతున్నారు. కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లోని మత్స్యకార గ్రామాలు భయంతో వణికిపోతున్నాయి. కాట్రేనికోన మండలం చిర్ర యానాం లేదా అల్లవరం-మామిడికుదురు మండలాల సరిహద్దులోని వైనతేయ నది సముద్ర సంగమ ప్రాంతం వద్ద తుపాను తీరం దాటే అవకాశాలపై ఉత్కంఠ నెలకొంది.

జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో వనామీ రొయ్యల సాగు జరుగుతుండగా, ప్రస్తుతం 10,800 ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నట్టు అంచనా. తుపాను ముప్పుతో రైతులు ముందుగానే పట్టుబడులు పడుతున్నారు. ముఖ్యంగా 40 నుంచి 100 కౌంట్ మధ్యలో ఉన్న రొయ్యలను వేగంగా విక్రయిస్తున్నారు. అయితే ఇదే అదనుగా కొనుగోలుదారులు ధరలు తగ్గించడంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది.

వారం క్రితం రూ.470 ఉన్న 30 కౌంట్ ధర ప్రస్తుతం రూ.430కి, రూ.340 ఉన్న 60 కౌంట్ ధర రూ.310కి, రూ.250 ఉన్న 100 కౌంట్ ధర రూ.220కి పడిపోయింది. కౌంట్‌ను బట్టి కేజీకి రూ.30 నుంచి రూ.40 వరకు తగ్గడంతో ఆక్వా రైతులపై అదనపు భారం పడుతోంది. తుపాను గాలులకు చెట్లు నేలకొరిగే ప్రమాదం ఉండటంతో కొబ్బరి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 1996 తుపాను నాటి చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ చెట్లపై బరువు తగ్గించేందుకు కాయల దింపులు తీయిస్తున్నారు. తోటల్లోని కొబ్బరి రాశులను ఇళ్లకు, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అర్నబ్ తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిపేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పంట ఏమవుతుందోనని అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు.

మనుషులే పుస్తకాలు.. జీవిత అనుభవాలే పాఠాలు!

- బెంగళూరులో వినూత్నంగా 'హ్యూమన్ లైబ్రరీ'..
- అపోహలు తొలగించే ముఖాముఖి సంభాషణలు

బెంగళూరులో నిర్వహిస్తున్న హ్యూమన్ లైబ్రరీ కార్యక్రమంలో జీవిత అనుభవాలను పంచుకుంటున్న పాల్గొనేవారు. (ఫైల్ ఫొటోలు)

బెంగళూరు : పుస్తకాల్లోని అక్షరాలే కాదు.. మనుషుల జీవిత అనుభవాలూ ఎన్నో పాఠాలను నేర్పుతాయి. భిన్న నేపథ్యాలకు చెందిన వ్యక్తులు తమ జీవిత ప్రయాణాన్ని ఇతరులతో పంచుకునే వినూత్న వేదికగా బెంగళూరులో 'హ్యూమన్ లైబ్రరీ' కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. పుస్తకాలను చదివినట్లే మనుషుల అనుభవాలను తెలుసుకునే ఈ విధానం ద్వారా సమాజంలోని అపోహలు, మూసధోరణులను తొలగించడంతోపాటు పరస్పర అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వాహకులు ముందుకు సాగుతున్నారు.

పుస్తకాల స్థానంలో మనుషులు!

సాధారణ గ్రంథాలయాల్లో పుస్తకాలను ఎంపిక చేసుకుని చదువుతారు. హ్యూమన్ లైబ్రరీలో మాత్రం జీవితంలో ఎన్నో అనుభవాలను ఎదుర్కొన్న వ్యక్తులతో నేరుగా మాట్లాడే అవకాశం ఉంటుంది. పాల్గొనేవారు తమకు ఆసక్తి ఉన్న అంశాన్ని ఎంచుకుని, సంబంధిత వ్యక్తితో ముఖాముఖి సంభాషిస్తారు. వారి అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్లు, నేర్చుకున్న పాఠాలను తెలుసుకుంటారు. ప్రశ్నలు అడుగుతూ కొత్త విషయాలను అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తారు.

తీర్పులకంటే అవగాహన ముఖ్యం

సమాజంలో వ్యక్తుల రూపం, వృత్తి, నేపథ్యం లేదా పరిస్థితులను బట్టి వారిపై అభిప్రాయాలు ఏర్పరచుకోవడం సాధారణం. అయితే వారి జీవిత కథలను నేరుగా విన్నప్పుడు ఆ అభిప్రాయాలు మారే అవకాశం ఉంటుంది. పరస్పర గౌరవం, సహానుభూతి, భిన్న దృక్పథాలను అర్థం చేసుకోవడం ఈ కార్యక్రమంలో ప్రధాన అంశాలు.

సంభాషణలతో కొత్త ఆలోచనలు

బెంగళూరులో నిర్వహిస్తున్న హ్యూమన్ లైబ్రరీ కార్యక్రమాల్లో పాల్గొనేవారిని చిన్న బృందాలుగా విభజించి, వివిధ అంశాలపై సంభాషణలు నిర్వహించే విధానాన్నీ అనుసరిస్తున్నారు. బాల్య జ్ఞాపకాల నుంచి వ్యక్తిగత అనుభవాలు, జీవనశైలి, ఆలోచనా విధానాల వరకు పలు అంశాలపై చర్చించే అవకాశం ఉంటుంది. మాట్లాడటానికి ఇష్టపడని వారు ఇతరుల అనుభవాలను వినడానికే పరిమితం కావచ్చు.

ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన భావన

హ్యూమన్ లైబ్రరీ భావన 2000లో డెన్మార్క్ రాజధాని కోపెన్‌హేగన్‌లో ప్రారంభమైంది. కాలక్రమేణా వివిధ దేశాలకు విస్తరించింది. భిన్న సామాజిక, సాంస్కృతిక నేపథ్యాల ప్రజల మధ్య అవగాహన పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతోంది. మనిషిని అర్థం చేసుకోవాలంటే అతడి గురించి వినడమే కాదు.. అతడి అనుభవాలను వినాలి. పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని పొందే సంప్రదాయానికి భిన్నంగా, మనుషుల జీవితాల నుంచే పాఠాలు నేర్చుకునే ఈ వినూత్న ప్రయత్నం సమాజంలో పరస్పర అవగాహనకు దోహదపడుతోంది.

కర్ణాటక 'సర్'లో కోటి ఓట్ల తొలగింపు

బెంగళూరు : కర్ణాటక ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ పూర్తయ్యింది. మంగళవారం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా నుంచి ఏకంగా 1.08 కోట్ల మంది పేర్లను తొలగించారు. దీంతో రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.54 కోట్ల నుంచి 4.54 కోట్లకు తగ్గింది. కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం తుది జాబితాలో 4,54,55,698 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,25,40,493 మంది పురుషులు, 2,29,12,255 మంది మహిళలు, 2,841 మంది ఇతర లింగానికి చెందినవారు ఉన్నారు. 18 నుంచి 19 ఏండ్ల మధ్య వయసున్న కొత్త ఓటర్లు 6.83 లక్షల మంది ఉన్నారు. కర్ణాటకలో జూన్ 30న 'సర్' ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అప్పటికి నమోదై ఉన్న 5.54 కోట్ల మంది ఓటర్ల వివరాలను పరిశీలించే బాధ్యతను బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వోలు) చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ఫారాలను సేకరించి, వివరాలను ధ్రువీకరించారు.

రాత్రివేళ రైళ్లలో మొబైల్ ఛార్జింగ్‌పై నిషేధం..

ఢిల్లీ : రైళ్లలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రైల్వే బోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం ఐదు గంటల మధ్యలో అన్ని ఛార్జింగ్ పాయింట్లు మూసివేసి ఉంచాలని, ఆ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని అన్ని జోన్లకు ఆదేశాలు ఇచ్చింది. ఇటీవల ముంబయి లోకల్ రైలులో ఛార్జింగ్ పెడుతుండగా.. ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలిపోయిన సంగతి తెలిసిందే. దాంతో కోచ్ అంతా దట్టమైన పొగ నిండిపోయింది. ఈ నేపథ్యంలోనే తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాత్రి 11 గంటల నుంచి ఆరు గంటల పాటు రైళ్లలోని కోచ్‌లలో ఉన్న మొబైల్, ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పాయింట్లు స్విచ్ఛాఫ్ చేసేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని అన్ని జోన్లకు బోర్డ్ సూచించింది. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ భద్రతా చర్యలను అమలు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించింది. రాత్రి సమయంలో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటం వల్ల ఓవర్ హీటింగ్, షార్ట్ సర్క్యూట్ జరిగితే వెంటనే గుర్తించడం కష్టమవుతోంది. దాంతో భారీ అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ఈ ముందు జాగ్రత్త చర్య చేపట్టారు. అయితే.. రైళ్లలో రాత్రి పూట ఛార్జింగ్‌పై ఆంక్షలు 2014లోనే తీసుకువచ్చారు. తాజా ఘటన నేపథ్యంలో వీటిని కట్టుదిట్టంగా అమలు చేసేలా రైల్వే బోర్డ్ ఆదేశాలు జారీ చేసింది.

వెంటనే కేంద్ర బృందాలను పంపండి

అమరావతి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ రాశారు. అర్నబ్ తుపానుతో రాష్ట్రంలో భారీగా పంటలు, ఆస్తులు దెబ్బతిన్నాయని.. నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలను వెంటనే పంపించాలని విజ్ఞప్తి చేశారు. తుపాను తీవ్రతతో పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని వివరించారు. సహాయక చర్యల కోసం 14 జిల్లాల్లో 16 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల నుంచి 28 వేల మందికి పైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని సీఎం వివరించారు.

ప్రాథమిక అంచనా ప్రకారం 180 ఇళ్లు దెబ్బతినగా, రహదారులపై 220కి పైగా చెట్లు కూలిపోయాయని లేఖలో పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో పలుచోట్ల రహదారులు ధ్వంసమయ్యాయని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని వివరించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు సుమారు 70,900 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని, 10,450 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, కృష్ణా జిల్లాల్లో తుపాను ప్రభావం అధికంగా ఉందని చంద్రబాబు లేఖలో వివరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కంట్రోల్ రూమ్‌లు, రాష్ట్ర అత్యవసర ఆపరేషన్స్ కేంద్రం నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. తుపాను నష్టంపై సమగ్ర అంచనా పూర్తయిన తర్వాత కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఇతర కేంద్ర సంస్థల సహకారాన్ని కొనసాగించాలని.. నష్టాన్ని అంచనా వేసేందుకు వీలైనంత త్వరగా కేంద్ర బృందాలను పంపించాలని అమిత్‌షాకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి నిరంతరం సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ సొంత నియోజకవర్గంలో బీజేపీకి షాక్!

లక్నో: ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో బీజేపీ ఓటమి పాలైంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని 11 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ ఐదు స్థానాలను గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రెండు స్థానాల్లో విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్‌తో పాటు మరో మూడు రాష్ట్రాల్లోని మొత్తం 28 ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఉత్తరప్రదేశ్‌లో 11 స్థానాలు ఉన్నాయి. అక్టోబర్ 23న ఈ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బహుళ అంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య ఓటింగ్ నిర్వహించారు. అక్టోబర్ 27న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లో ఐదు గ్రాడ్యుయేట్, ఆరు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. లక్నో, వారణాసి, ఆగ్రా, మీరట్, అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలతో పాటు లక్నో, వారణాసి, ఆగ్రా, మీరట్, బరేలీ-మొరాదాబాద్, గోరఖ్‌పూర్-ఫైజాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించారు.



స్థానిక సమరంలో కూటమికి సీట్ల సెగ!

» మున్సిపాలిటీల్లో సర్దుబాటు.. పరిషత్ ఎన్నికల్లో పోటాపోటీ

» గ్రామస్థాయిలో మిత్రపక్షాల మధ్య ముదురుతున్న ఆధిపత్య పోరు..

» అంతర్గత విభేదాలతో ప్రతిపక్షానికి కలిసొచ్చేనా?

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేళ అధికార కూటమికి సీట్ల సర్దుబాటు సెగ తగులుతోంది. పట్టణాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కొంతమేర సయోధ్య కుదిరినా.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు వచ్చేసరికి మిత్రపక్షాల మధ్యే పోరు ముదురుతోంది. తమ బలానికి తగిన సీట్లు, కీలక పదవుల కోసం నేతలు పట్టుబడుతుండటంతో అనేక చోట్ల కూటమి అభ్యర్థులే పరస్పరం పోటీకి దిగే పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీల్లో వ్యక్తిగత ప్రతిష్ఠలు, స్థానిక వర్గ రాజకీయాలు ఈ విభేదాలను మరింత జటిలం చేసే ప్రమాదం కనిపిస్తోంది. ఫలితంగా ఓట్ల చీలికతో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి అనూహ్యంగా లబ్ధి చేకూరే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రస్థాయిలో పొత్తు ధర్మాన్ని చాటుతున్న కూటమి నేతలు.. క్షేత్ర స్థాయిలో అసంతృప్తులను బుజ్జగించి, మిత్రపక్షాల మధ్య పోటీని నియంత్రించగలరా? అన్నది ఇప్పుడు రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

వేలాది ఆశలు.. సీట్లు మాత్రం పరిమితం!

శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకం రాష్ట్రస్థాయిలో పరిమిత నియోజకవర్గాల పరిధిలోనే సాగుతుంది. కానీ స్థానిక సంస్థల ఎన్నికలకొచ్చేసరికి లెక్కలు పూర్తిగా మారిపోతాయి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతోపాటు గ్రామ పంచాయతీల్లోనూ వేలాది మంది నాయకులు పదవులను ఆశిస్తారు. ఏళ్ల తరబడి పార్టీ జెండాలు మోసిన కార్యకర్తలు, స్థానికంగా పట్టున్న నేతలు తమకు అవకాశం రావాలని కోరుకుంటారు. అయితే, ఆశావహులందరికీ పదవులు కేటాయించడం సాధ్యం కాదు. దీంతో సీట్ల సర్దుబాటు పార్టీల మధ్య ఒప్పందానికే పరిమితం కాకుండా.. స్థానిక నేతల మధ్య ఆధిపత్య పోరుగా మారుతోంది. కూటమి నేతలు సంయుక్త మీడియా సమావేశంలోనూ స్థానిక ఎన్నికల్లో సర్దుబాట్ల సంక్లిష్టతను ప్రస్తావించడం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది.

మున్సిపాలిటీల్లో సర్దుబాటు.. పరిషత్‌ల దగ్గరే అసలు పరీక్ష!

మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సీట్ల పంపకంపై అధిష్టానాలు, ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జిల స్థాయిలో చర్చలు జరిపి ఒక అవగాహనకు వచ్చేందుకు ప్రయత్నించాయి. ప్రధాన పట్టణాల్లో కొన్ని చోట్ల సర్దుబాట్లు కొలిక్కి రావడంతో కూటమి నేతలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య స్థానిక ఆధిపత్య పోరు, తమ బలానికి తగిన ప్రాతినిధ్యం కావాలన్న జనసేన డిమాండ్లు సీట్ల పంపకాన్ని మరింత క్లిష్టం చేస్తున్నాయి. 30 శాతానికి పైగా స్థానాలతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ పదవులపైనా జనసేన ఆశలు పెట్టుకోవడంతో కొన్ని ప్రాంతాల్లో విభేదాలు తీవ్రతరమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక, బీ-ఫారాల పంపిణీ విషయంలో స్పష్టత కొరవడిన చోట్ల కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థులే పరస్పరం పోటీకి దిగుతున్నారు. సర్దుబాట్లపై చర్చలు కొనసాగుతున్నా.. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే వరకు ఈ పోటీలు కొనసాగితే మిత్రపక్షాల మధ్య ఓట్ల చీలిక తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు జోక్యం చేసుకుంటున్నప్పటికీ.. ఇప్పటికే బరిలోకి దిగిన ద్వితీయ శ్రేణి నాయకులు వెనక్కి తగ్గేందుకు సిద్ధపడకపోవడం సమస్యను మరింత జటిలం చేస్తోంది.

పంచాయతీల్లో ఎవరి పట్టు వారిదే!

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారే అవకాశముంది. పార్టీ గుర్తులపై కాకుండా అభ్యర్థుల వ్యక్తిగత గుర్తింపుతో సాగే ఈ ఎన్నికల్లో కుటుంబ సంబంధాలు, సామాజిక సమీకరణాలు, గ్రామస్థాయి వర్గ విభేదాలు కీలక పాత్ర పోషిస్తాయి. పార్టీ అధిష్టానం ఒకే అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినా.. స్థానికంగా బలమైన ఆశావహులు పోటీ నుంచి తప్పుకోవడం అంత సులభం కాదు. గ్రామాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న రాజకీయ వైరం, వ్యక్తిగత ప్రతిష్ఠ, వర్గ ఆధిపత్యం వంటి అంశాలు పార్టీ నిర్ణయాలకంటే బలంగా పనిచేసే సందర్భాలుంటాయి. దీంతో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఒకే అభ్యర్థి వెనుక నిలబడతారా? లేక తమ బలాన్ని నిరూపించుకునేందుకు విడివిడిగా బరిలోకి దిగుతారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఓట్ల చీలిక.. ప్రతిపక్షానికి కలిసొచ్చేనా?

మిత్రపక్షాల మధ్య పోటీ అనివార్యమైతే దాని ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడే అవకాశముంది. ఒకే కూటమికి చెందిన అభ్యర్థులు పరస్పరం ఓట్లు చీల్చుకుంటే.. బలమైన అభ్యర్థికి కూడా ఓటమి ఎదురయ్యే పరిస్థితి ఏర్పడవచ్చు. ఇలాంటి పరిణామాలు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అయితే, స్థానికంగా ఏర్పడే విభేదాలు అన్ని చోట్లా ఒకే విధంగా ఫలితాలను ప్రభావితం చేస్తాయని చెప్పలేం. అభ్యర్థుల వ్యక్తిగత బలం, గ్రామస్థాయి సమీకరణాలు, పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయం కూడా కీలకమే. అయినప్పటికీ, మిత్రపక్షాల మధ్య సమన్వయం లోపిస్తే కూటమి బలానికి గండి పడే ప్రమాదం మాత్రం ఉంది.

అధిష్టానానికి అసలైన సవాలు!

పట్టణ ప్రాంతాల్లో సీట్ల సర్దుబాటుతో సాధించిన సమన్వయాన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనసాగించడం కూటమి నాయకత్వానికి కీలకంగా మారింది. ప్రతి ఆశావహుడికీ పదవి ఇవ్వడం సాధ్యం కాకపోయినా.. అసంతృప్తితో పార్టీకి దూరమయ్యే నాయకులను బుజ్జగించడం, తిరుగుబాటు అభ్యర్థులను ఉపసంహరింప జేయడం, మిత్రపక్షాల మధ్య పరస్పర విశ్వాసాన్ని కాపాడటం అత్యవసరం. స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పదవుల పంపకానికి సంబంధించిన వ్యవహారం కాదు. గ్రామస్థాయిలో పార్టీల బలం, నాయకుల ప్రభావం, కూటమి ఐక్యతకు ఇవి పరీక్షగా నిలుస్తాయి. సీట్ల కోసం మొదలైన పోరు ఎన్నికల తర్వాత కూడా కొనసాగితే దాని ప్రభావం భవిష్యత్తు రాజకీయాలపైనా పడవచ్చు. పదవుల పంపకంలో ఎదురయ్యే అసంతృప్తిని ఎంతవరకు చల్లార్చగలరు? మిత్రపక్షాల మధ్య పోటీని ఏ మేరకు నియంత్రించగలరు? ఓట్ల చీలికను ఎలా అడ్డుకోగలరు? అన్నదే ఇప్పుడు కూటమి నాయకత్వం ముందున్న అసలైన సవాలు. రాష్ట్రస్థాయిలో పొత్తు కొనసాగడం ఒక ఎత్తయితే.. గ్రామస్థాయిలో నూ అదే ఐక్యతను నిలబెట్టుకోవడం మరో ఎత్తు. స్థానిక ఎన్నికల ఫలితాలు ఈ రెండు అంశాల్లో కూటమి నాయకత్వం సాధించిన విజయాన్ని స్పష్టం చేయనున్నాయి.

విస్కీ 9 లీటర్లు.. బీర్ 18 లీటర్లు.. ఇంటి నుంచే బుకింగ్!

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మద్యం కొనుగోళ్ల కోసం కొత్త ఆన్‌లైన్ బుకింగ్ విధానం అందుబాటులోకి వచ్చింది. ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (డీఎస్ఐఐడీసీ)'Delhi Liquor Booking' పేరుతో మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. దీని ద్వారా 25 ఏళ్లు నిండిన వినియోగదారులు అందుబాటులో ఉన్న బ్రాండ్లలో విస్కీ, బీర్‌ను ముందుగానే బుక్ చేసుకోవచ్చు. అయితే, ఆన్‌లైన్‌లో బుక్ చేసిన మద్యాన్ని ఇంటికి పంపించే సదుపాయం లేదు. వినియోగదారులు తాము ఎంచుకున్న మద్యం దుకాణానికి వెళ్లి, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కొనుగోళ్లను తీసుకెళ్లాల్సి ఉంటుంది.

బుకింగ్ ఎలా చేయాలంటే?

ముందుగా యాప్‌లో అందుబాటులో ఉన్న బ్రాండ్లను పరిశీలించి, డీఎస్ఐఐడీసీ నిర్వహించే మద్యం దుకాణాన్ని ఎంచుకోవాలి. అనంతరం బాటిల్ పరిమాణం, కావాల్సిన పరిమాణాన్ని ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో చెల్లింపు చేయాలి. బుకింగ్ పూర్తయిన తర్వాత వినియోగదారులకు క్యూఆర్ కోడ్ అందుతుంది. దాన్ని ఎంపిక చేసుకున్న దుకాణంలో స్కాన్ చేసి మద్యాన్ని తీసుకోవచ్చు. ప్రస్తుతం ఈ సదుపాయం డీఎస్ఐఐడీసీ నిర్వహిస్తున్న దుకాణాల్లో మాత్రమే అందుబాటులో ఉంది. ఢిల్లీ వ్యాప్తంగా

సంస్థకు 208 మద్యం దుకాణాలు ఉన్నాయి.

బుకింగ్ పరిమితులు ఇవే..

ఢిల్లీ ఎక్సైజ్ నిబంధనల ప్రకారం, ఒక వ్యక్తి గరిష్ఠంగా 9 లీటర్ల విస్కీ, 18 లీటర్ల బీర్‌ను బుక్ చేసుకోవచ్చు. అయితే, ఆయా దుకాణాల్లో అందుబాటులో ఉన్న బ్రాండ్లను బట్టి కొనుగోళ్లు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో చేసిన బుకింగ్‌ను మద్యం తీసుకెళ్లే ముందు రద్దు చేసుకోవచ్చు. ఒకసారి కొనుగోలు చేసి దుకాణం నుంచి తీసుకెళ్లిన మద్యాన్ని తిరిగి ఇవ్వడం సాధ్యం కాదు.

ఈ కొత్త విధానం ఎందుకంటే?

మద్యం దుకాణాల వద్ద వేచి ఉండే సమయాన్ని తగ్గించడం, చెల్లింపుల కౌంటర్లపై ఒత్తిడిని తగ్గించడం, ధరలు, బిల్లింగ్‌లో పారదర్శకతను పెంచడం ఈ యాప్ ప్రధాన లక్ష్యాలని అధికారులు తెలిపారు. వినియోగదారులు తమకు నచ్చిన బ్రాండ్లను ముందుగానే ఎంచుకునే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. అయితే, ఇప్పటివరకు ఆన్‌లైన్ బుకింగ్‌కు వినియోగదారుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ విధానాన్ని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలా వద్దా అనేది ప్రజల స్పందనపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.

సమాధానానికి పది రోజుల గడువు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఎన్నికల కమిషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై పదిరోజుల్లో సమాధానాలు ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టు మంగళవారం పిటిషనర్లను ఆదేశించింది. సర్‌పై జారీ చేసిన మూడు ఆదేశాలు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని చెబుతూ దాఖలైన ఈ అఫిడవిట్‌లో మిగిలిన అంశాలకు సంబంధించిన వివరణ కూడా ఉంది.

బిహార్‌లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే ఫారం-6లో మార్పులు చేసిన విషయంపై రాజ్యసభ సభ్యురాలు డోలా సేన్ దాఖలు చేసిన తాజా పిటిషన్‌పైనా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈసీతోపాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. డోలా సేన్ తరపున సీనియర్ న్యాయవాది, ఎంపీ మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు.

ఫారం-6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఈసీ తప్పుగా పేర్కొందని ఆరోపించారు. దీనికి ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ అన్ని అంశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈసీ దాఖలు చేసిన అఫిడవిట్‌కు పది రోజుల్లో ప్రత్యుత్తరం సమర్పించాలని తొలి పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరపు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్‌కు సూచించారు.

విద్యావికాసం

తెరిచిన పుస్తకాలు, వికసించిన మనసులు, ఉన్నతమైన భవిష్యత్తు

“పుస్తకాలు, మనసులు, గొడుగులు తెరిచి ఉన్నప్పుడే తమ ప్రయోజనాన్ని అందిస్తాయి.” ఈ చిన్న వాక్యంలో ఎంతో గొప్ప జీవిత సత్యం దాగి ఉంది. గొడుగు తెరిచినప్పుడే వర్షం నుంచి రక్షణ కల్పిస్తుంది. పుస్తకం తెరిచి చదివినప్పుడే జ్ఞానాన్ని అందిస్తుంది. అదేవిధంగా, కొత్త ఆలోచనలను స్వీకరించడానికి, ప్రశ్నించడానికి, ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి మనసును తెరిచినప్పుడే మనలో జ్ఞానం, వివేకం, విజ్ఞానం పెరుగుతాయి.

తెరిచిన పుస్తకం మనసుకు జ్ఞానాన్ని అందిస్తుంది. తెరిచిన మనసు ఆలోచనలను మారుస్తుంది. మన చేతలు మన ప్రభావితం చేస్తాయి. మన చేతలు మన భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి.ఒక చిన్నారి చేతిలో ఒక మూసివున్న పుస్తకం ఉందని ఊహించండి. ఆ పుస్తకంలో కథలు, అభిప్రాయాలు, ఆలోచనలు, ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఆ చిన్నారి పుస్తకాన్ని తెరిచి చదవడం ప్రారంభిస్తాడు. చదువు అతని మనసును వికసింపజేస్తుంది. వికసించిన మనసు కొత్త ఆలోచనలకు దారి తీస్తుంది. ఆ ఆలోచనలు మంచి పనులకు ప్రేరణనిస్తాయి. ఆ పనులు అతని భవిష్యత్తును మెరుగుపరచడంలో సహాయపడతాయి. కొత్త విషయాలను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండటం, మన ఆలోచనలను పరిశీలించడం, మన చేతలను జాగ్రత్తగా ఎంచుకోవడం మన అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది.

కాబట్టి మనం గుర్తుంచుకోవలసిన విషయం:

జ్ఞానం కోసం పుస్తకాలను తెరవండి. వివేకం కోసం మనసును తెరవండి. తర్వాత ఆలోచనలను మెరుగుపరచుకోండి. ఆలోచనలను మంచి పనులుగా మార్చండి. మీ చేతల ద్వారా మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోండి.

“మూసివున్న పుస్తకంలో జ్ఞానం దాగి ఉంటుంది. మూసివున్న మనసులో అవకాశాలు మరుగున పడతాయి. ఆ రెండింటిని తెరవండి - మీ అభివృద్ధికి మీరే మార్గం వేసుకోండి!”

వేదాంతం విజయ నరసింహాచార్యులు

M.A.B. Ed., H. M. స్ఫూర్తి (భవిష్య) విద్యా సంస్థలు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

బెల్లంకొండ : బెల్లంకొండ మన్నె సుల్తాన్ పాలెం మండలంలోని మన్నె సుల్తాన్ పాలెం గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఘోర విక్తతి చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న సచివాలయ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పెదలంక భాను కుమార్ పై గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా దాడి చేసి, నగదు దోపిడీకి పాల్పడ్డారు. బాధిత ఉద్యోగి తెలిపిన వివరాల ప్రకారం.భాను కుమార్ గ్రామస్తులకు పింఛన్ల పంపిణీని పూర్తి చేసుకుని తిరిగి సచివాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో సచివాలయంలోకి చొరబడిన కొందరు గుర్తుతెలియని దుండగులు, ఆయన్ను బలవంతంగా బయటకు లాక్కొచ్చారు. అతనిపై తీవ్రంగా దాడి చేసి, పింఛన్ల పంపిణీ పోగా మిగిలిన రూ. 1,30,000 నగదును లాక్కున్నారు. అనంతరం దుండగులు నాలుగు మోటార్ బైక్‌లపై అక్కడి నుంచి వేగంగా పరారయ్యారు. సహోద్యోగులపైనే అనుమానం:ఈ దాడి ఘటనపై బాధితుడు భాను కుమార్ సంచలన విషయాలు వెల్లడించారు. కందిపాడుకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, అలాగే తమ పంచాయతీ కార్యదర్శి పై తనకు అనుమానం ఉందని ఆయన పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. నిందితులపై తగిన చర్యలు తీసుకోవా లని సచివాలయ ఉద్యోగులు, బాధితుడు పోలీసు శాఖను కోరారు.

న్యాయ నేత్రం

బాలికల పై లైంగిక నేరాలకు కఠినమైన శిక్షలు

ఇక్కడ బాలికలు అనగా 18 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న వారిని బాలికలు గా చట్టం గుర్తిస్తుంది. ఎవరైనా ఆ బాలికల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన, అనుచితంగా ప్రవర్తించిన, అసభ్యం గా ప్రవర్తించిన, అసభ్య సైగలు చేసిన,కన్నుకొట్టి(?) చేసిన, ఆశ పెట్టిన, మోసం చేసిన, బాలికలను అక్రమంగా తరలిస్తున్న, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించిన, చాలా కఠినమైన శిక్షలు చట్టం లో ఉన్నాయి. బాలికల ను ఎత్తుకొని ఆడించే సమయంలో వారి ప్రైవేట్ పార్ట్ లను తాకిన శిక్షార్హులు అవుతారు. అలాగే ఆ అమ్మాయి ఇష్టానుసారంగా ప్రేమిస్తున్న అని వెంట పడటం గాని, ఆమె. ఇష్ట పూర్వకంగానే శారీరకంగా కలిశామని(?) అన్న నేరం అవుతుంది. లేదా ప్రేమించమని వెంటపడి వేధించిన నేరం అవుతుంది. కావున ప్రతి ఒక్కరూ బాలికలే కాకుండా ఆడవారి పట్ల కూడా చాలా జాగ్రత్తగా మసలుకోవటం చాలా ముఖ్యం. ఈ కేసులు పోక్సో కోర్టుల ద్వారా అనగా పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై. కఠినమైన చర్యలు తీసుకోవటం జరుగుతుంది. భారత దేశ చట్టంలో ఈ పోక్సో చట్టం చాలా తీవ్రమైనది. శిక్షలు దాదాపు 20 సంవత్సరం ల వరకు కారాగార శిక్షలు మరియు పైన పడే అవకాశం ఉంది. కావున ప్రతి ఒక్కరూ బాలికల పట్ల, స్త్రీల పట్ల గౌరవంగా, హుందాగా మెలగాలి.

షేక్ జానీ ఖాజావలి, న్యాయవాది, M.Com, LL.B., **9441085206**

ఉల్లం పలుకు :



అధిక శాతం ప్రజలచేత ద్వేషింప బడేది ఎవరంటే పచ్చినిజం చెప్పే ప్రబుద్ధుడే!”

- ఉల్లం శేషగిరిరావు అడ్వకేట్, హైకోర్టు & సామాజిక విశ్లేషకులు.

పరిహారం పంపిణీని వేగవంతం చేయండి

అమరావతి: ఏపీలో బీభత్సం సృష్టించిన అర్నబ్ తుపాను అనంతర పరిస్థితులపై జిల్లా కలెక్టర్లు, అధికారులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సాధారణ పరిస్థితి నెలకొనేవరకు అధికారులెవరూ విశ్రమించొద్దని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాలు మినహా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ స్థితి నెలకొందని అధికారులు సీఎంకు వివరించారు. పునరుద్ధరణ పనులపై అధికారులు, జిల్లా కలెక్టర్లతో సీఎం సమీక్షించి తుపాను నష్టంపై ఇవాళ ప్రాథమిక నివేదిక పంపాలన్నారు. బాధితులకు పరిహారం అందించే పనిని మరింత వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇలాంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలవాలన్నారు. అధికారులు సమర్థంగా పనిచేశారని చంద్రబాబు అభినందించారు. రహదా రులపై పడిపోయిన చెట్లను వెంటనే తొలగించడంతోపాటు తుపాను కారణంగా పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సీఎం ఆదేశించారు. నష్టపరిహారానికి సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేసిందని, పంట నష్టం మినహా మిగిలిన బాధితులకు పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేసేందుకు సాంకేతికతను వినియోగించాలని, రైతుల వారీగా వివరాలు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలతోపాటు.. కొబ్బరి సహా ఉద్యాన పంటల చెట్లు, మొక్కలను తిరిగి నాటే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన రైతుల నష్టాన్ని భర్తీ చేసేందుకు అందుబాటులో ఉన్న వివిధ పథకాలను వర్తింపజేయాలని సూచించారు.

అర్నబ్ తుపానుతో అతలాకుతలం..

అమరావతి : అర్నబ్ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్‌లో బీభత్సం సృష్టిస్తున్నది. ముఖ్యంగా కోస్తా జిల్లాలను తుపాను అతలాకుతలం చేస్తున్నది. గురువారం అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటలు, ఇండ్లు కోల్పోయిన సామాన్య జనం నేడు మళ్లీ భారీ వర్షాలు కురుస్తాయనే వార్త వారిని కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది. కాగా, భారీ వర్షాలకు వృక్షాలు నేలకొరిగాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వివిధ ప్రాంతాల్లో 8 మంది మృతి చెందారు. కోనసీమ, గోదావరి జిల్లాల్లో భారీగా పంట నష్టం కలిగింది. ప్రభుత్వం సత్వరమే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంచర్ల బుల్లిబాబుకు 'గాంధీజీ సేవారత్న' పురస్కారం

సత్తనపల్లి: సత్తనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న విశిష్ట సేవా కార్యక్రమాలను గుర్తించి, ఆ సంస్థ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబుకు “గాంధీజీ సేవారత్న” పురస్కారాన్ని అంద జేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్ మరియు గ్లోబల్ సర్వీస్ నిర్వాహకులు టి. రామోజీ, బాలాజీల ఆధ్వర్యంలో ఈ పురస్కార ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సీఎస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పి.వి.పి. అంజనీకుమారి, మేడిద సుబ్బయ్య ట్రస్ట్ వ్యవస్థాపకులు మేడిద వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా కంచర్ల బుల్లిబాబును జ్ఞాపిక, శాలువా మరియు పూలదండలతో ఘనంగా సత్కరించి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గాయకు లు, నిర్వాహకులు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ... “సమాజం పట్ల బాధ్యత కలిగి నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మమ్మల్ని గుర్తించి, రామోజీ ఈ అవార్డునుఅందజేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ విజయం నా ఒక్కడికే సాధ్యమైంది కాదు. దీని వెనుక ఎందరో దాతల ఉదారత, నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరియు హెల్ప్ ఫౌండేషన్ సభ్యుల నిరంతర సహకారం ఉంది” అని తెలిపారు.

గొర్తి శ్రీనివాస శర్మ మృతికి సంతాపం దోషులను కఠినంగా శిక్షించాలి :

సత్తెనపల్లి: విజయవాడ బ్రాహ్మణ కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ గొర్తి శ్రీనివాస శర్మ అకాల మరణం పట్ల సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం మరియు బ్రాహ్మణ ఐక్య వేదిక సత్తెనపల్లి డివిజన్ ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. రెండు సంఘాలు సంయుక్తంగా ఒక పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎలమంచిలి వద్ద ఉన్న చించినాడ బ్రిడ్జి పైనుంచి గోదావరి నదిలోకి దూకి శ్రీనివాస శర్మ అసువులు బాసిన ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ వ్యవహారంలో నాగ సాయిని మాతృ శాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం తక్షణమే చేపట్టిన చర్యలను సంఘాల ప్రతినిధులు హర్షించారు. ప్రభుత్వం ఈ కేసులో పూర్తి స్థాయి నిష్పాక్షిక దర్యాప్తు జరిపించి దోషులకు తగిన శిక్ష పడేలా చూడాలని, అలాగే మృతి చెందిన శ్రీనివాస శర్మ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరారు.

ఆర్నాబ్ తుఫాన్ ఎఫెక్ట్: అప్రమత్తమైన పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

క్రోసూరు : ‘ఆర్నాబ్’ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పల్నాడు జిల్లా క్రోసూరు, దొడ్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తమయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్ ఆదేశాల మేరకు తుఫాను ముందస్తు చర్యలు చేపట్టినట్లు వైద్యులు రవికుమార్, అనిల్ కుమార్ గురువారం వెల్లడించారు. ఈ చర్యల్లో భాగంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ దొడ్లేరు, అనంతవరం గ్రామాలలో పర్యటించారు. తుఫాను సమయంలో ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

వైద్య ఆరోగ్యశాఖ జారీ చేసిన ముఖ్యమైన సూచనలు:

గర్భిణీల గుర్తింపు, తరలింపు: రానున్న రెండు వారాల్లో ప్రసవమయ్యే అవకాశం ఉన్న గర్భిణీలను, అలాగే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గర్భిణీలను ముందుగానే గుర్తించి సురక్షితంగా సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలి.

తాగునీరు, పారిశుద్ధ్యం: గ్రామ కార్యదర్శులతో కలిసి తాగునీరు, పారిశుద్ధ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలి. అంటు వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి.

సురక్షిత ఆహారం నీరు: కలుషిత నీటిని తాగకుండా, కేవలం కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఆహార పదార్థాలను ఎల్లప్పుడూ శుభ్రంగా, సురక్షితంగా ఉంచుకోవాలి.

దోమల నివారణ: వర్షపు నీరు నిల్వ ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఆరోగ్య కేంద్రాల సంప్రదింపు: జ్వరం, విరోచనాలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. తుఫాను పరిస్థితులను నిరంతరం గమనిస్తూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా మరియు పురుష ఆరోగ్య కార్యకర్తలు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవలు అందించాలని ఈ సందర్భంగా శిఖా శాంసన్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు క్రోసూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎంపిక

ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

క్రోసూరు: జాతీయస్థాయి క్రీడా పోటీలకు క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దుద్దుల దయాకర్ ఎంపికై, జాతీయస్థాయిలో గుర్తింపు సాధించడం ఎంతో గర్వకారణమని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ కొనియాడారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-14 రగ్బీ ఆటలో ప్రతిభ చాటిన దయాకర్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గి బాబురావు మాట్లాడుతూ ఢిల్లీలో పంజాబ్, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో తమ పాఠశాల విద్యార్థి పాల్గొనడం ఎంతో సంతోషదాయకమన్నారు. దయాకర్ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిడి మహా నరసింహారావు, ఉపాధ్యాయులు రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొని విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు.

నిజాయితీ గల పిచ్చుక నేర్పిన జీవిత పాఠం.. నిజాయితీకి మించిన ఆభరణం మరొకటి లేదు

కనువిప్పు

సత్తెనపల్లి ప్రతినిధి : మనిషి జీవితంలో సంపాదించే సంపదకంటే, కష్టపడి సాధించే విజయాలకంటే, ఇతరుల ముందు ప్రదర్శించే హోదా కంటే విలువైనది నిజాయితీ. మనిషి వ్యక్తిత్వానికి నిజమైన అందం అతని మాటల్లోనో, వస్త్రధారణలోనో, సంపదలోనో ఉండదు. అతని ఆలోచనల్లో, ప్రవర్తనలో, నడవడికలో, ఇతరుల పట్ల చూపించే నమ్మకంలో ఉంటుంది. ఈ గొప్ప జీవిత సత్యాన్ని ఒక చిన్న పిచ్చుక కథ ఎంతో అద్భుతంగా మనకు తెలియజేస్తుంది. ఒక అడవిలో ఒక చిన్న పిచ్చుక ఉండేది. అది ప్రతిరోజూ ఆహారం కోసం వెతుకుతూ తన జీవితాన్ని సాగించేది. ఒకరోజు ఆ పిచ్చుకకు దారిలో ఒక బంగారు ఉంగరం కనిపించింది. ఆ ఉంగరం ఎంతో విలువైనదని దానికి తెలుసు. అయినప్పటికీ, అది తనకు చెందని వస్తువని భావించి తన దగ్గర ఉంచుకోకుండా, ఆ ఉంగరం ఎవరిదో తెలుసుకోవాలని నిర్ణయించుకుంది. సాధారణంగా ఎవరైనా విలువైన వస్తువు దొరికితే దానిని తమ సొంతం చేసుకోవాలని ఆశపడవచ్చు. కానీ ఆ చిన్న పిచ్చుక మాత్రం తన ఆశకు లొంగకుండా నిజాయితీకి ప్రాధాన్యత ఇచ్చింది. ఆ ఉంగరాన్ని ఎవరో పోగొట్టుకున్నారని, దాని కోసం వారు వెతుకుతూ ఉండవచ్చని భావించింది. తనకు దక్కిన వస్తువు కంటే, దాని అసలు యజమానికి దానిని తిరిగి అందించడం ముఖ్యమని భావించింది.

ఈ చిన్న కథ మనిషి జీవితానికి ఎంతో గొప్ప సందేశాన్ని అందిస్తుంది. మనకు ఇతరుల సొమ్ము దొరికినప్పుడు దానిని సొంతం చేసుకోవడం తెలివి కాదు, మనకు అప్పగించిన బాధ్యతను నమ్మకంగా నిర్వర్తించడమే నిజమైన గొప్పతనం. ఎవరికీ తెలియకుండా తప్పు చేయగల అవకాశం ఉన్నప్పుడు కూడా తప్పు చేయకుండా ఉండటమే నిజాయితీకి అసలైన పరీక్ష. మనల్ని ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ప్రవర్తిస్తామన్నదే మన వ్యక్తిత్వానికి నిజమైన కొలమానం.

నేటి సమాజంలో డబ్బు, హోదా, అధికారం, పేరు ప్రఖ్యాతుల కోసం చాలామంది పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో కొందరు విలువలను మరచిపోతున్నారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం నమ్మకాన్ని కోల్పోతున్నారు. ఎదుటివారిని మోసం చేసి సాధించిన విజయం గొప్పదిగా కనిపించవచ్చు. కానీ అలాంటి విజయానికి మనశ్శాంతి ఉండదు. మోసం ద్వారా సంపాదించిన సంపద కంటే నిజాయితీతో సంపాదించిన చిన్న మొత్తమే ఎంతో విలువైనది. ఎందుకంటే డబ్బుతో వస్తువులను కొనవచ్చు, అధికారంతో పదవులను పొందవచ్చు, మాటలతో కొంతకాలం ఇతరులను నమ్మించవచ్చు. కానీ నిజమైన గౌరవాన్ని, మనస్ఫూర్తిగా లభించే ప్రేమను, చెక్కుచెదరని నమ్మకాన్ని మాత్రం నిజాయితీతోనే సంపాదించగలం.

ఒక వ్యక్తి నిజాయితీగా ఉంటే అతనిపై కుటుంబ సభ్యులకు నమ్మకం పెరుగుతుంది. సమాజంలో గౌరవం లభిస్తుంది. స్నేహితుల మధ్య విశ్వసనీయత ఏర్పడుతుంది. కష్టకాలంలో అతని వెనుక నిలబడే మనుషులు ఉంటారు. అదే నిజాయితీని విడిచిపెట్టి స్వార్థానికి ప్రాధాన్యత ఇస్తే, ఎంత సంపద ఉన్నా మనసులో ప్రశాంతత కరువవుతుంది. అందుకే నిజాయితీ అనేది కేవలం ఒక మంచి గుణం మాత్రమే కాదు, అది మనిషి జీవితాన్ని సక్రమమైన మార్గంలో నడిపించే గొప్ప శక్తి.

ఈ కథలోని చిన్న పిచ్చుక మనకు మరో విషయాన్ని కూడా నేర్పుతుంది. గొప్ప సందేశాలు చెప్పడానికి పెద్ద హోదాలు అవసరం లేదు. జీవిత సత్యాలను తెలియజేయడానికి గొప్ప ఉపన్యాసాలు అవసరం లేదు. ఒక చిన్న పక్షి ప్రవర్తన కూడా మనిషికి జీవితాంతం గుర్తుండిపోయే పాఠాన్ని నేర్పగలదు. మనిషి గొప్పతనం అతని శరీరాకృతిలోనో, వయసులోనో, సంపదలోనో ఉండదు. అతని హృదయంలో ఉన్న మంచితనంలో ఉంటుంది. ఇతరులకు మేలు చేయాలనే ఆలోచనలో ఉంటుంది. తనకు లాభం లేకపోయినా సరైన పని చేయాలనే ధైర్యంలో ఉంటుంది.

తల్లిదండ్రులు తమ పిల్లలకు కేవలం చదువులు, ఉద్యోగాలు, డబ్బు సంపాదించే మార్గాలు మాత్రమే నేర్పితే సరిపోదు. నిజాయితీగా జీవించడం, ఇతరుల హక్కులను గౌరవించడం, తప్పు చేసినప్పుడు అంగీకరించడం, కష్టపడి సంపాదించడం, మాట నిలబెట్టుకోవడం వంటి విలువలను కూడా నేర్పాలి. ఎందుకంటే చదువు మనిషికి జ్ఞానాన్ని ఇస్తే, సంస్కారం ఆ జ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో నేర్పుతుంది. తెలివితేటలు విజయాన్ని అందించవచ్చు. కానీ ఆ విజయానికి గౌరవాన్ని తీసుకొచ్చేది మంచి వ్యక్తిత్వమే.

నిజాయితీ మార్గంలో నడిచేవారికి కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురుకావచ్చు. తక్షణ ప్రయోజనాలు దూరమవవచ్చు. ఇతరులు తప్పు మార్గంలో వేగంగా ముందుకు వెళ్తున్నట్లు కనిపించవచ్చు. అయినప్పటికీ మన విలువలను వదులుకోకూడదు. ఎందుకంటే నిజాయితీ ప్రయాణం కొంత నెమ్మదిగా సాగినా, అది మనకు



ఆత్మగౌరవాన్ని, మనశ్శాంతిని, శాశ్వతమైన గౌరవాన్ని అందిస్తుంది. ఇతరులను మోసం చేసి గెలవడం కంటే, మన విలువలను కాపాడుకుంటూ సాధించిన చిన్న విజయం కూడా ఎంతో గొప్పది.

ఆ చిన్న పిచ్చుక కథ మనందరికీ ఒక ప్రశ్నను సంధిస్తోంది. మనకు తెలియకుండా ఒక తప్పు చేసే అవకాశం వచ్చినప్పుడు మనం ఏం చేస్తాం? మనకు చెందని వస్తువు దొరికితే ఏ నిర్ణయం తీసుకుంటాం? మన ప్రయోజనం కోసం ఎదుటివారి నమ్మకాన్ని దెబ్బతీస్తామా? లేక మన మనస్సాక్షి చెప్పిన మార్గంలో నడుస్తామా? ఈ ప్రశ్నలకు మనం ఇచ్చే సమాధానాలే మన నిజమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి.

చివరగా చెప్పాలంటే, జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మన మూల విలువలను మరచిపోకూడదు. ఎంత సంపాదించినా మన మంచితనాన్ని కోల్పోకూడదు. ఎంత అధికారం పొందినా మనుషుల పట్ల గౌరవాన్ని విడిచిపెట్టకూడదు. ఎందుకంటే మనం ఈ ప్రపంచం నుంచి వెళ్లిపోయిన తర్వాత మన వెంట వచ్చేది మనం కూడబెట్టుకున్న సంపద కాదు, మనం ఇతరుల హృదయాల్లో సంపాదించుకున్న గౌరవం, ప్రేమ, నమ్మకం మాత్రమే.

ఒక చిన్న పిచ్చుక తన ప్రవర్తనతో చెప్పిన గొప్ప జీవిత సత్యం ఇదే. నిజాయితీగా జీవించాలి, నమ్మకంగా నడుచుకోవాలి, ఇతరులకు హాని చేయకుండా మన వంతు మంచిని పంచాలి. మనిషిగా పుట్టినందుకు సంపదను సంపాదించడం మాత్రమే కాదు, మంచి మనసును సంపాదించడం కూడా మన బాధ్యత. నిజాయితీని మన జీవితానికి పునాదిగా చేసుకుంటే మన ప్రయాణం అర్థవంతమవుతుంది. మన జీవితం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది. నిజాయితీగా జీవించడం మన గొప్పతనం. నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మన బాధ్యత. మన మంచితనంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపడం మనిషిగా మనం సాధించగల అత్యున్నత విజయం

మత్స్యకారులకు పరిహారం చెల్లించాలి!

అమరావతి : అర్నబ్ తుపాను దెబ్బకు జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులను ఆదుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన హైబ్రిడ్ విధానంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉప్పాడ తీర ప్రాం త బాధితుల సమస్యలను ప్రస్తావించారు. తుపాను కారణంగా దెబ్బ తిన్న బోట్లకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు, చేనేత రంగానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకోవాలని కోరారు.

బోట్ల నష్టం 157.. పరిహారం ఎప్పుడు? : అలల ఉధృతికి ఉప్పాడ తీరంలో 40 బోట్లు దెబ్బతిన్నాయని, ఉప్పాడ మత్స్యకారు లకు చెందిన మరో 117 బోట్లు కోనసీమ జిల్లా తీర ప్రాంతంలో ధ్వంసమయ్యాయని పవన్ కళ్యాణ్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. యు.కొత్తపల్లి మండల పరిధిలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న నష్టాన్ని వివరించారు. మొత్తం 157 బోట్లకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని కోరారు. తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో బోట్లు, వలలు, ఇతర వేట సామగ్రిని కోల్పోయిన మత్స్యకారులందరికీ వీలైనంత త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేటే ఆధారంగా జీవించే కుటుంబాలకు నష్టం వాటిల్లడంతో, సహా యం ఆలస్యం కాకుండా చూడాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

చేనేత మగ్గాలకూ తుపాను దెబ్బ : ఉప్పాడ ప్రాంతంలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పవన్ కళ్యాణ్ కేబినెట్ ముందు ఉంచారు. భారీ వర్షాలతో మగ్గాల్లోకి నీరు చేరడం, విద్యుత్ లైన్లు తెగిపోవడంతో చేనేత పనులకు ఆటంకం ఏర్పడిందని వివరించారు. ఇప్పటికే ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కుటుంబాలకు తుపాను నష్టం మరింత భారంగా మారే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. చేనేతలకు జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి, అర్హులైన బాధితులకు తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విపత్తు నిర్వహణపై చంద్రబాబుకు ప్రశంసలు : తుపాను హెచ్చరికలు వెలువడినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలను సమన్వయం చేస్తూ పరిస్థితులను నిరం తరం సమీక్షించారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలను ఆయన అభినందించారు. అత్యవసర సేవలను అందుబాటులో ఉంచడంతో పాటు తుపాను సహాయక చర్యలను సమన్వయం చేసిన మంత్రివర్గ సహచరులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల సిబ్బంది కృషిని కూడా ప్రశంసించారు.

ఫోన్‌లో కొత్త రూల్!



మన ఫోన్‌కు రోజూ ఎన్నో తెలియని నంబర్ల నుంచి కాల్స్ వస్తుంటాయి. అవతలి వ్యక్తి ఎవరో తెలియక కొందరు కాల్స్ లిఫ్ట్ చేయడానికి వెనుకాడుతుంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా నవంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా కొత్త సేవ అందుబాటులోకి రానుంది. ఫోన్‌లో సేవ్ చేయని నంబర్ నుంచి కాల్ వచ్చినా.. ఆ నంబర్ ఎవరి పేరుతో నమోదైందో స్క్రీన్‌పై కనిపించనుంది.

కేంద్ర టెలికాం శాఖ ఆదేశాల మేరకు కాలర్ నేమ్ ప్రెజెంటేషన్ సేవను అమల్లోకి తీసుకురానున్నారు. ఈ సేవ ద్వారా కాల్ చేసిన వ్యక్తి పేరు ఫోన్ స్క్రీన్‌పై కనిపించేలా ఏర్పాట్లు చేయాలని టెలికాం సర్వీస్ ప్రొవైడర్లను శాఖ ఆదేశించింది. ప్రస్తుతం 4జీ, 5జీతో పాటు అంతకంటే ఆధునిక నెట్‌వర్క్‌లలో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించింది. ఇందుకోసం వినియోగదారులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఫోన్‌లో ఆ నంబర్‌ను ఇప్పటికే సేవ్ చేసుకుంటే.. కాంటాక్ట్స్‌లో ఉన్న పేరే కనిపిస్తుంది. ఒకవేళ నంబర్ సేవ్ చేయకపోతే, సిమ్ తీసుకునే సమయంలో టెలికాం సంస్థ వద్ద నమోదు చేసిన పేరు స్క్రీన్‌పై చూపించనున్నారు. అంటే సిమ్ ఎవరి పేరుతో నమోదైందో ఆ వివరాల ఆధారంగా కాలర్ పేరు కనిపిస్తుందని అధికారులు తెలిపారు. అయితే ఈ సదుపాయం ప్రస్తుతానికి 4జీ, 5జీ నెట్‌వర్క్‌లకే పరిమితం కానుంది. 2జీ, 3జీ ఫోన్లకు ఈ సేవను తర్వాత అందుబాటులోకి తీసుకురావడంపై నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే విదేశాల నుంచి వచ్చే కాల్స్ విషయంలో, సేవ్ చేయని నంబర్లకు వ్యక్తి పేరు బదులుగా ఇంటర్నేషనల్ కాల్ అని కనిపించేలా ఏర్పాటు చేయనున్నట్లు టెలికాం శాఖ పేర్కొంది. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ విషయంలో కాలర్ వివరాలను తెలుసు కునేందుకు ఈ సేవ ఉపయోగపడు తుందని అధికారు లు భావిస్తున్నారు. ముఖ్యంగా ఇతరుల పేర్లతో ఫోన్ చేసి మోసాలకు పాల్పడే ఘటనలను అరికట్టడంలో ఈ విధానం తోడ్పడుతుందని టెలికాం శాఖ తెలిపింది. అయితే స్క్రీన్‌పై పేరు కనిపించినంత మాత్రాన ఆ కాల్ నమ్మదగినదని భావించ కూడదు. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండటం అవసరం.

ఫామ్ 6, 7, 8లను మార్చలేరు..

న్యూఢిల్లీ : ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, చిరునామా మార్పులకు సంబంధించిన ఫామ్-6, 7, 8లను ఎన్నికల సంఘం ఇష్టానుసారంగా మార్చడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్ష (సర్) ప్రక్రియపై బుధవారం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేర్లున్న వారిని ముసాయిదా జాబితా నుంచి తొలగిస్తే, తిరిగి వారి పేరును చేర్చడానికి కొత్త ఓటర్ల నమోదు కోసం ఉద్దేశించిన ఫామ్-6 సమర్పించాలని ఎందుకు అడుగుతున్నారని ఈసీని ప్రశ్నించింది.

నిర్దేశిత ఫామ్‌లను మార్చలేరు

ఫామ్ 6,7,8లు చట్ట నిబంధనల ప్రకారం నిర్దేశించిన ఫారాలని, వాటి రూపాన్ని మార్చడానికి ఈసీకి అధికారం లేదని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. అయితే, అవసరమైతే అదనపు వివరాలు లేదా ప్రకటనలను జతచేసే అవకాశం ఉందని తెలిపారు. ఢిల్లీలో గతంలో ఓటర్ల జాబితాలో పేర్లున్న వారు 'సర్' సమయంలో గణన ఫారాలు సమర్పించలేకపోతే, వారి పరిస్థితికి అనుగుణంగా పరిష్కారం చూపాలని ధర్మాసనం సూచించింది. వారిని కొత్త ఓటర్లుగా పరిగణించి ఫామ్ 6 నింపాలని కోరడం సరికాదని అభిప్రాయపడింది.

ఫామ్ 6 కొత్త ఓటర్ల కోసమే

మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునేవారి కోసం ఫామ్ 6 ఉద్దేశించినది. చిరునామా మారిన ఓటర్లు వివరాలు సవరించుకునేందుకు ఫామ్ 8 వినియోగిస్తారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్న వ్యక్తి పేరు ముసాయిదా జాబితాలో కనిపించకపోతే, తన పేరు గతంలో ఎప్పుడూ జాబితాలో లేదని ప్రకటిస్తూ ఫామ్ 6 సమర్పించాలని కోరడం ఇబ్బందికరమని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. ఓటర్లు తాత్కాలికంగా ఢిల్లీకి దూరంగా ఉండటం, చిరునామా మారడం

లేదా గణన ఫారం అందకపోవడం వంటి కారణాలతో 'సర్' ప్రక్రియలో పాల్గొనకపోయి ఉండవచ్చని కోర్టు పేర్కొంది. అలాంటి వారికి తిరిగి గణన ఫారం సమర్పించే అవకాశం కల్పించాలని, చిరునామా మారినవారు ఫామ్ 8 ద్వారా వివరాలు సవరించుకునేలా చూడాలని సూచించింది.

గడువు విధించొద్దు

ఢిల్లీలో ప్రస్తుతం సమీప భవిష్యత్తులో ఎన్నికలు లేనందున, ఓటర్ల పేర్ల పునరుద్ధరణకు అక్టోబర్ 30తో గడువు ముగుస్తుందని చెప్పడం ఎందుకని ధర్మాసనం ప్రశ్నించింది. పేర్లను తిరిగి చేర్చుకునే ప్రక్రియకు కటాఫ్ తేదీ విధించవద్దని సూచించింది. ఓటర్లే అధికారులను సంప్రదించే వరకు వేచి ఉండకుండా, వారి వివరాలను సేకరించి వారిని చేరుకునేందుకు ఎన్నికల సంఘం చొరవచూపాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. ఫామ్6, ఫామ్ 8లను స్వీకరించే ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. అవసరమైతే దరఖాస్తుల గడువును పొడిగించే అంశాన్ని పరిశీలిస్తామని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది.

అర్నబ్ తుపానులో మునిగిన అన్నదాత

అమరావతి: అర్నబ్ తుపాను ప్రభావంతో లక్షలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. కోనసీమ రైతులకు కల్పవృక్షంగా నిలిచిన కొబ్బరి చెట్లు వేలాదిగా విరిగిపడగా, అరటి, బొప్పాయి తోటలు నేలకొరిగాయి. లంక గ్రామాల్లో కూరగాయల పంటలు కొట్టుకుపోయాయి. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి, కోస్తాంధ్రలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు రైతులకు ఉన్న కొద్దిపాటి ఆశలను చిదిమేశాయి. తీరప్రాంతాల్లో ఆక్వా రంగంపై కూడా తుపాను తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

ప్రాథమిక అంచనాల ప్రకారం..249 మండలాల్లో 2,747 గ్రామాల పరిధిలో 5 లక్షల మంది రైతులకు చెందిన 8.30 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల అంచనా. వీటిలో అత్యధికంగా 7.60 లక్షల ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైనట్లుగా లెక్కతేల్చారు. 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలతో పాటు మరో 20 వేల ఎకరాల్లో మొక్క జొన్న, పత్తి, మినుము, పెసలు చెరుకు తదితర పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ప్రభుత్వం ఉదారంగా ఆదుకోకపోతే తమ పరిస్థితి అధోగతే అని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

తుపానుతో శ్రీకాకుళం మొదలు బాపట్ల వరకు తీర ప్రాంత జిల్లాల్లోని పంటలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. ఖరీఫ్‌లో 37.33 లక్షల ఎకరాల్లో వరి సాగవగా, దాంట్లో 26 లక్షల ఎకరాలు తుపాను ప్రభావిత జిల్లాల్లోనే సాగైంది. ఈ జిల్లాల్లో ఎకరాకు రూ.40 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. పొట్ట దశకు చేరుకున్న వరి చేలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి జిల్లాల్లో పంట పూర్తిగా నేలమట్టమైంది.

పంట చేలలో మొలలోతు నీరు నిలిచిపోయింది. తుపాను తీరం దాటినప్పటికీ ఆ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాల వల్ల ముంపునకు గురైన వరిచేలు కుళ్లిపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోనసీమలో 1.10 కోట్లకు పైగా కొబ్బరి చెట్లున్నాయి. బలమైన గాలులకు తీర ప్రాంతంలో వేలాది చెట్లు విరిగిపడి పోగా, మరికొన్ని చోట్ల మొవ్వలు దెబ్బతిన్నాయి. ఎకరాకు 10కు పైగా చెట్లు నేలకొరిగినట్లు అధికారుల అంచనా. ఈ తుపాను ప్రభావంతో ఐదారు నెలల పాటు దిగుబడులొచ్చే పరిస్థితుల్లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. ప్రాథమికంగా 150 మండలాల్లో 809 గ్రామాల పరిధిలో 50 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా 34 వేల ఎకరాల్లో అరటి, 8,600 ఎకరాల్లో కూరగాయలు, 1400 ఎకరాల్లో బొప్పాయి, వెయ్యి ఎకరాల్లో కొబ్బరి, వెయ్యి ఎకరాల్లో పసుపు, 2,300 ఎకరాల్లో ఆయిల్ పామ్, టమాటా, మిరప, పూలు, తమలపాకు తదితర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరితోపాటు మొక్కజొన్న, పత్తి, ఉద్యాన పంటలను తుపాను దెబ్బతీసింది. విద్యుత్ కోతలతో కోస్తా జిల్లాల్లోని ఆక్వా చెరువులకు ఆక్సిజన్ కొరతతో లక్షలాది ఎకరాల్లోని ఆక్వా చెరువుల్లో రొయ్యలు తేలిపోతున్నాయి.

ఎల్‌నినో పడగ.. మార్చినాటికి భారత్‌లో 55వేల మరణాలు..

ప్రపంచంపై ఎల్‌నినో పడగవిప్పింది. దాంతో ఒకచోట కరవు, ఇంకోచోట వరదలు, తుపానుల వంటి విపత్తులు విరుచుకుపడుతున్నాయి. పెరుగుతోన్న ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణ నిపుణులు దీనిని సూపర్ ఎల్‌నినో అని పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌నినో హీట్ మోర్టాలిటీ ట్రాకర్ విడుదల చేసిన గణాంకాలు మరింత భయాందోళన కలిగిస్తున్నాయి. ఈ అసాధారణ వాతావరణ మార్పు వల్ల సాధారణంగా వేసవిలో సంభవించే మరణాల కన్నా ప్రపంచవ్యాప్తంగా అదనంగా 3,73,000 మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, రానున్న ఆరు నెలల్లో ఈ మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది.

గ్లోబల్ సౌత్ దేశాల్లో విపరీతమైన వడగాలులు, వేడి సంబంధిత మరణాలు ఎక్కువగా ఉండొచ్చని మోర్టాలిటీ ట్రాకర్ నివేదిక హెచ్చరించింది. భారత్‌పై కూడా ఎల్‌నినో ప్రభావం గట్టిగానే ఉంటుందని, అక్టోబర్ నుంచి మార్చి మధ్యలో 55వేల మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. అత్యధిక మరణాలు మార్చి నెలలోనే నమోదు కావొచ్చని వెల్లడించింది. నైజీరియాలో 56వేలు, ఇండోనేషియాలో 29వేలు, బ్రెజిల్‌లో 19వేల చొప్పున మరణాలు ఉండొచ్చని పేర్కొంది. 1950 తర్వాత ఈసారే అత్యంత బలమైన ఎల్‌నినో ఏర్పడిందని, దీని ప్రభావం 2027లోనూ కొనసాగుతుందని ఇప్పటికే ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఎల్‌నినో ప్రభావంతో ప్రాణనష్టాన్ని అంచనా వేయడానికి క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ ఈ మోర్టాలిటీ ట్రాకర్‌ను రూపొందించింది. "తీవ్రమైన వేడి ప్రభావాలను ముందుగానే గుర్తించడం ఉన్నంతలో మంచి విషయం. దీనివల్ల ప్రజలకు ఎక్కువ ప్రమాదం ఎక్కడ ఉందో గుర్తించి, ప్రాణనష్టం జరగకముందే నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది" అని ఈ ల్యాబ్ సహ వ్యవస్థాపకుడు మైఖెల్ గ్రీన్‌స్టోన్ అభిప్రాయం వ్యక్తంచేశారు. అభివృద్ధి చెందుతున్న, వెనకబడిన దేశాలను గ్లోబల్ సౌత్‌గా చెప్తుంటారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలో ఈ దేశాలు ఎక్కువగా ఉంటాయి. తలసరి ఆదాయం అంతంతమాత్రంగా ఉండటం, పేదరికం, మౌలిక సదుపాయాల లేమితో పాటు ప్రధానంగా వ్యవసాయంపైనే ఈ దేశాలు ఆధారపడుతుంటాయి.

సీతారాముల కల్యాణ వైభవం

వేదమంత్రాల సాక్షిగా, మంగళవాయిద్యాల నడుమ జగమంతా పులకించే సీతారాముల కల్యాణ వైభోగం భారతీయుల హృదయాల్లో చెరగని మధురస్మృతి. ఈ దివ్యమైన వివాహ వేడుకను వెండితెరపై కనువిందు చేసేలా ఆవిష్కరిస్తూ 'రామాయణ' చిత్రం నుంచి 'జతగూడె' అనే పాటను విడుదల చేశారు. సీతారాముల పాత్రల్లో రణబీర్‌కపూర్, సాయిపల్లవి నటిస్తున్న ఈ చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. నితేష్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మించారు.

శుక్రవారం విడుదల చేసిన 'జతగూడె' పాట సీతారాముల కల్యాణ వైభవాన్ని ఆవిష్కరిస్తూ సాగింది. ఏ.ఆర్.రెహమాన్ స్వరపరచిన ఈ గీతానికి రాకేందుమౌళి సాహిత్యాన్ని అందించారు. శిరీష భాగవతుల ఆలపించారు. సీతారాముల వివాహ వేడుకతో పాటు అయోధ్యను దాటి ఈ జంట సాగించిన ప్రయాణానికి సంబంధించిన దృశ్యాలు పాటలో ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. సంప్రదాయ వైభవం, ఆధ్యాత్మికత కలబోతగా రామభక్తులను అలరించేలా ఈ పాట సాగింది.

అందుకే మౌనంగా ఉన్నా!

తెలుగులో జాన్వీ కపూర్ చేసిన దేవర, పెద్ది సినిమాలు వాణిజ్యపరంగా ఎలాగున్నా.. పాత్రల పరంగా మాత్రంఆమెకు చేదు అనుభవాలనే మిగిల్చాయి. ఆ పాత్రల విషయంలో విమర్శలను కూడా ఆమె ఎదుర్కోవలసివచ్చింది. అయితే.. ఇన్నాళ్లూ వాటిపై స్పందించని జాన్వీ.. తొలిసారి 'కాఫీ విత్ కరణ్ 9' టాక్‌షోలో వాటిగురించి మాట్లాడింది. 'ముందుగానే నటీనటులకు స్క్రిప్ట్ అందించడం, కెమెరా యాంగిల్స్ వివరాలనుస్పష్టంగా పేర్కొనడం దక్షిణాది సినిమాల్లో జరగదు. నాకున్న సినీ నేపథ్యాన్ని ఉపయోగించుకొని అప్పుడే కాస్త గట్టిగా అభిప్రాయాలను వెల్లడించాల్సింది. కానీ నేను అలా చేయలేదు. కాబట్టి, ఇందులో నా తప్పు కూడా ఉంది. ఆ సినిమాల కోసం చాలామంది కష్టపడ్డారు. పొరపాట్లు ఏమైనా జరిగితే దానిలో నా బాధ్యత కూడా ఉంటుంది కదా. అందుకే మౌనంగా ఉన్నాను. షూటింగ్ టైమ్‌లో దర్శకుడు చెప్పినట్టు చేయాలనే వృత్తిపరమైన ఒత్తిడి కూడా ఉంటుంది. ఏదేమైనా.. వాటి వల్ల ఎదురైన బాధనూ, భారాన్ని ఎప్పటికీ మోస్తూనే ఉంటాను. ఇకపై ఈ విషయం గురించిఎక్కడా ప్రస్తావించాలనుకోవడం లేదు' అంటూ జాన్వీ స్పష్టం చేసింది.



జయలలిత పాత్రలో త్రిష..

తమిళనాడు రాజకీయాల్లో నటి త్రిష పేరు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా నటుడు విజయ్ రాజకీయ ప్రస్థానం, తమిళనాడు రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమె పేరు తరచూ వార్తల్లో వినిపిస్తోంది. ఈ క్రమంలోనే త్రిషకు సంబంధించి కోలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నటి జయలలిత పాత్రలో త్రిష నటించబోతున్నారనే ప్రచారం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. లెజెండరీ నటుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ జీవితకథ ఆధారంగా 'పురచ్చి తలైవర్ ఎంజీఆర్' పేరుతో ఓ బయోపిక్ తెరకెక్కనుంది. ఎంజీఆర్ సినీ ప్రయాణం నుంచి రాజకీయ ప్రస్థానం వరకు ఆయన జీవితంలోని కీలక ఘట్టాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. ఈ కథలో జయలలిత పాత్రకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉండనుంది. ఎంజీఆర్‌తో కలిసి ఎన్నో సినిమాల్లో నటించిన జయలలిత.. ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళనాడు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. ముఖ్యమంత్రిగా కూడా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో జయలలిత పాత్రకు త్రిషను ఎంపిక చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం ఆమెను సంప్రదించే ప్రయత్నాలు

జరుగుతున్నాయనే వార్తలు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. అయితే త్రిష ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు అంగీకరించారా? ఆమెనే జయలలిత పాత్రలో ఖరారు చేశారా? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. జయలలిత జీవితం ఎన్నో మలుపులతో సాగింది. బాలనటిగా, ఆ తర్వాత అగ్ర కథానాయికగా సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన ఆమె.. ఎంజీఆర్‌తో కలిసి పనిచేసిన సమయంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అనంతరం రాజకీయాల్లోకి అడుగుపెట్టి అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టి, పలుమార్లు ముఖ్యమంత్రిగా తమిళనాడుకు సేవలందించారు. ఆమె వ్యక్తిత్వం, రాజకీయ పోరాటం, ప్రజల్లో ఉన్న ఆదరణ కారణంగా జయలలిత జీవితం వెండితెరపై చూపించడం దర్శకులకు పెద్ద సవాలనే చెప్పాలి. ఇలాంటి కీలకమైన పాత్రలో త్రిష నటిస్తే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు దశాబ్దాలకు పైగా సినీ ప్రయాణం కొనసాగిస్తున్న త్రిషకు నటిగా మంచి గుర్తింపు ఉంది. జయలలిత పాత్రలో ఆమె ఎలా కనిపిస్తారు? ఆ పాత్రకు అవసరమైన హావభావాలు, గంభీరమైన వ్యక్తిత్వాన్ని ఎంతవరకు తెరపై ఆవిష్కరిస్తారు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT GUNDEPUDI VARI VEEDHI, D.NO.18-6-12/4, ACHAMPET ROAD, SATTENAPALLI, PALNADU DISTRICT. ARUNDALPETA, 13TH LINE, 3RD CROSS ROAD, D.NO.31-13-1138, GUNTUR, A.P.- 522002. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.